thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 201 | జగిత్యాల మంగళవారం 03 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్



11

స్వచ్ఛ ఇంధనంతోనే దేశ ఆర్థిక భద్రత


- శిలాజ ఇంధనాలపై అధిక ఆధారపడటం ప్రమాదకరం
- పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం 300 గిగావాట్లకు చేరువ
- 2025లోనే 50 శాతం శిలాజేతర విద్యుత్ లక్ష్యం సాధన
- భారత్ రెన్యువబుల్ ఎనర్జీ సదస్సులో ప్రధాని మోదీ



4

రష్యా యుద్ధక్షేత్రంలో ఐదుగురు తెలుగు యువకులు

- ఉద్యోగాల పేరుతో మోసం చేసి యుద్ధంలోకి
- ఫుడ్ ప్యాకింగ్ పనులంటూ నమ్మించిన ఏజెంట్
- స్వదేశానికి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేడుకోలు




రష్యాలో చిక్కుకున్న ఇద్దరు విశాఖ యువకులు

4

డ్రగ్స్ కేసులో ఇరికించే యత్నం.. ఏఎస్ఐ సస్పెండ్

- శివసేన నేత ఇంట్లో పరుపు కింద హెరాయిన్
- రహస్య కెమెరాలో రికార్డైన పోలీసు అధికారి చర్యలు
- నేతను అరెస్ట్ చేసిన తర్వాత వెలుగులోకి వీడియో
- ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్‌పై వేటు.. విచారణకు ప్రత్యేక బృందం



4



- ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలి
- మహా పాదయాత్రలో హోంమంత్రి అమిత్ షా పిలుపు
- హైదరాబాద్ వీధుల్లో కదం తొక్కిన కమల దళం
- బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం
- భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

అరాచక పాలనకు స్వస్తి పలకాలి

హైదరాబాద్, నవంబర్ 2 :

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకత్వాన్ని అంతం చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించేందుకు హైదరాబాద్ గడ్డపై ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీని గెలిపించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా 'లోక్‌తంత్ర బచావో - అరాచకత హఠావో' నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మహా పాదయాత్ర కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో అత్యంత ఉత్సాహభరితంగా

మిగతా 2వ పేజీలో..



క్లీన్, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

- చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహించొద్దు
- అవసరానికి అనుగుణంగా గ్రీన్ ట్యాంకర్లు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- మున్సిపల్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 2 :

హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై దిశానిర్దేశం చేశారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ప్రతిరోజూ ఇంటింటా చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ఇండస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు 'ఐలా' అధికారులతో సమన్వయం

మిగతా 2వ పేజీలో..



ఖేలో ఇండియా ఏర్పాట్లపై సీఎం సమీక్ష

- ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ వనరులతో ఏర్పాట్లు
- ఆరు నగరాల్లో 20 వేదికలపై పోటీలు
- నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి ఆదేశం

2



ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ

- అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహణ
- నాన్ స్టెమ్ కోర్సుల విద్యార్థులకూ ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 2 :

రాష్ట్రంలో లక్షమంది విద్యార్థులకు ఉచితంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వంపై గానీ, కళాశాలలు లేదా విద్యార్థులపై గానీ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్‌లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. టాస్క్, ఏడబ్ల్యూఎస్ మధ్య ఇందుకు సంబంధించిన ఒప్పందం సచివాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 643 టాస్క్

మిగతా 2వ పేజీలో..

ఐఆర్‌సీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

- 19 నుంచి 22 వరకు జరిగే సమావేశంపై చర్చ
- రోడ్లు, భవనాలు శాఖపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

3

కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలు

- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- రైతులను తప్పక ఆదుకుంటాం
- జిల్లా అభివృద్ధిని పట్టించుకోని రేవంత్ రెడ్డి
- ప్రభుత్వం హాస్పిటల్స్ పై దృష్టి పెట్టాలి
- బీఆర్ ఎస్ ఎల్పీ ఉప నాయకుడు హరీశ్ రావు

3





రెవెన్యూ, అటవీ వివాదాలకు జాయింట్ సర్వేతో ఫుల్‌స్టాప్

- గ్రామస్థాయి నుంచి రెండు శాఖల మధ్య సమన్వయం అవసరం
- జాయింట్ సర్వేను స్వయంగా పర్యవేక్షిస్తా
- ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి

2

ఒమర్–నిధి వివాహంపై చెల్లదు

- వధూవరులిద్దరూ ముస్లింలై ఉండాలి
- నిధి రజ్దాన్ ఇస్లాంలోకి మారాల్సిందని సూచన
- ఆల్ ఇండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా రజ్వీ



4

పేదలకు 24 గంటలూ ఉచిత న్యాయసేవలు

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పిలుపు

4



తెలంగాణకు బీజేపీ చేసిందేమిటో చెప్పాలి

- విభజన హామీలు, కేంద్ర నిధులపై అమిత్ షాకు ప్రశ్నలు
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏమయ్యాయి?
- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ సంబంధాలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

2

మార్కెట్లలో ఏఐ విప్లవానికి శ్రీకారం

- డిజిటల్ మార్కెట్ యార్డులతో అక్రమాలకు చెక్
- రైతులకు గిట్టుబాటు ధర, వ్యాపారంలో పూర్తి పారదర్శకతే లక్ష్యం
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు

3

అరాచక పాలనకు స్వస్తి పలకాలి



మొదటిపేజీ తరువాయి

సాగింది. నిజాం కాలేజీ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర మొజంజాహి మార్కెట్ క్రాస్ రోడ్స్ వరకు కొనసాగింది. పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానుల భారీ భాగస్వామ్యంతో హైదరాబాద్ వీధులన్నీ కాషాయమయం అయ్యాయి. అడుగడుగునా జై బీజేపీ నినాదాలతో నగర వీధులు హోరెత్తాయి. కాషాయ జెండాలు రెపరెపలాడాయి. మహా పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తూ అమిత్ షా ముందుకు సాగారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ నాటి ఉక్కు మనిషి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ లేకపోతే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించేది కాదని గుర్తు చేశారు. కాంగ్రెస్, ఇండి కూటమి చేపడుతున్న ర్యాలీలు ఓటు బచావో కోసం కాదని, చొరబాటుదారు(ఘుస్‌పైఠియా)లను కాపాడేందుకేనని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ('సర్'), ఓట్ల తొలగింపుపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో 13 కోట్ల ఓట్లు రద్దయ్యాయని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు.. అసలు తొలగించిన ఓట్లలో ఆరున్నర కోట్లు వేరే ప్రాంతాలకు మారిన వారివి కాగా, మరో మ□డు కోట్ల మంది చనిపోయిన వారి ఓట్లు ఉన్నాయి. చనిపోయిన వారి ఓట్లను తొలగించవద్దా.. నకిలీ ఓట్లను తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు కడుపుమంట అని ప్రశ్నించారు. 'సర' కారణంగానే తాము అధికారంలోకి వచ్చామని రాహుల్ అంటున్నారు. . మరి రాహుల్ ఎంపీ అయింది కూడా 'సర్' వల్లేనా అంటూ కేంద్ర హోంమంత్రి చురకలంటించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు హక్కు దక్కనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉందంటూ అలాంటి పార్టీ మోదీని అడ్డుకుంటుందా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ కాపాడలేరు అని స్పష్టం చేశారు.

ఈవీఎంలు, 'సర్'పై చర్చకు సవాల్

'సర్' అమలులోకి రాకముందే కేంద్రంలో బీజేపీ వరుసగా మూడుసార్లు గెలిచిందని, 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పుడు 'సర్' జర గలేదని అమిత్‌షా గుర్తు చేశారు. మహారాష్ట్ర, హర్యానా, దిల్లీ, బీహార్, బెంగాల్, అస్సాం ఎన్నికల్లో ప్రజాదరణతోనే విజయం సాధించామన్నారు. గెలిస్తే ప్రజలు గెలిపించినట్లు, ఓడిపోతే ఈవీఎంలపై నెపం వేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా వారి పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు. ఈవీఎంల ద్వారానే బీజేపీ గెలిస్తే మరి తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది.. కేరళ, తమిళనాడులో బీజేపీయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయి అని ఆయన ప్రశ్నించారు. ఈవీఎంలు, 'సర్' అంశాలపై చర్చకు తాము సిద్ధమంటూ పార్లమెంటులో ఈ అంశంపై చర్చకు రాకుండా కాంగ్రెస్ ఎందుకు పారిపోతోందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే కాంగ్రెస్, ఇండి కూటమి రాజకీయాలకు ప్రజాక్షేత్రంలోనే తగిన సమాధానం చెప్తామని, భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

మూక్ పార్లమెంటులోనే రాహుల్ ప్రధాని

రాహుల్ గాంధీ ఎప్పటికీ దేశానికి ప్రధాని కాలేరని అన్నారు. కేవలం మూక్ పార్లమెంటులోనే ప్రధాని కాగలరని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

దిల్లీకి ఏటీఎంగా తెలంగాణ..

ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంలా మార్చేసిందని, రాష్ట్రప్రజల సొమ్ముతో నిస్సిగ్గుగా ఆర్ఆర్ (రాహుల్‌రేవంత్) ట్యాక్స్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని అమిత్ షా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వసూలు చేసిన ఈ సొమ్ము నేరుగా రాహుల్ గాంధీ వద్దకే వెళ్తోందని ఆరోపించారు. ఈ అవినీతిని బీఆర్ఎస్ గానీ, ఒవైసీ పార్టీ గానీ అడ్డుకోలేవని, బీజేపీ మాత్రమే చెక్ పెట్టగలదని ఉద్ఘాటించారు. మోదీ 12 ఏళ్ల పాలనపై ఒక్క అవినీతి మరక కూడా లేదంటూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మహా పాదయాత్ర, బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, గోడం నగేశ్, రఘునందన్ రావులతో పాటు అనేకమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఘన స్వాగతం.. భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం

హైదరాబాద్ పర్యటనకు ప్రత్యేక విమానంలో విచ్చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు బేగంపేట విమానాశ్రయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన చార్మినార్ సమీపంలోని ప్రసిద్ధ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇండి కూటమి ప్రచారాలను తిప్పికొడదాం : రామచందర్ రావు

ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని అంతం చేద్దాం అనే నినాదంతో మహా పాదయాత్రలో ప్రజలు, బీజేపీ కార్యకర్తలు కనీవినీ ఎరుగని రీతిలో భారీగా తరలివచ్చి విజయవంతం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు కొనియాడారు. పాదయాత్రలో అడుగడుగునా ఉత్సాహం నింపిన కార్యకర్తలకు, ప్రజలకు, భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తరఫున, పార్టీ రాష్ట్ర శాఖ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపైనా, బీజేపీపైనా, చివరకు దేశ రాజ్యాంగబద్ధ సంస్థలపైనా కాంగ్రెస్, ఇండి కూటమి పార్టీలు పచ్చి అబద్ధాలతో విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా దేశ పౌరుల ప్రయోజనాల కోసం చేపడుతున్న 'సర' ప్రక్రియపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను దగా చేయాలని, తప్పుదోవ పట్టించాలని కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. కాంగ్రెస్, ఇండి కూటముల ఈ విష పూరిత కుట్రలను, దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టడానికే అమిత్ షా హైదరాబాద్ గడ్డపై మన మధ్యకు వచ్చి ఈ రెండు కిలోమీటర్ల మహా పాదయాత్రలో మనతో కలిసి అడుగులు వేశారని చెప్పారు. పార్టీ శ్రేణులు కూడా ప్రజల్లోకి వెళ్లి ఎక్కడికక్కడ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు.

తెలంగాణకు బీజేపీ చేసిందేమిటో చెప్పాలి

హైదరాబాద్, నవంబర్ 2:



కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. పదేళ్లకు పైగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రల పేరుతో రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణకు కేటాయించిన నిధులు, ఉద్యోగాలు, రైతుల సంక్షేమంపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని హామీల అమలు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, రాష్ట్ర ప్రాజెక్టులకు జాతీయ హోదా వంటి అంశాలపై అమిత్ షా స్పష్టత ఇవ్వాలని కోరారు. పన్నుల వాటా, కేంద్ర గ్రాంట్ల కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. రాష్ట్రానికి బీజేపీ చేసిన మేలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని, ఆ పార్టీ బలహీనపడటంతో ఆ స్థానాన్ని ఆక్రమించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. రెండు పార్టీల మధ్య రహస్య అవగాహన ఉందన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ, ఓటు చోరీ ఆరోపణలపైనా కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మతం, భావోద్వేగాల ఆధారంగా రాజకీయాలు చేయడం మానుకుని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మహేశ్ కుమార్ గౌడ్ హితవు పలికారు.



ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ

మొదటిపేజీ తరువాయి

అనుబంధ కళాశాలల్లోని విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ తదితర ఇండస్ట్రీ ఓరియంటెడ్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ప్రత్యక్షంగా ప్రాక్టికల్స్ చేసేందుకు ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతోపాటు ఆర్ట్స్, కామర్స్ తదితర నాన్ స్టెమ్ కోర్సుల విద్యార్థులకూ ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కోర్సులో చేరిన ప్రతి విద్యార్థికి 'ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్' ద్వారా 900 కంటే ఎక్కువ డిజిటల్ కోర్సులను ఏడాదిపాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పరీక్షల కోసం డిస్కౌంట్ వోచర్లను కూడా అందిస్తామన్నారు. విద్యార్థులకు సాంకేతిక నిపుణులతో ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు, హ్యాకథాన్లను నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అర్హులైన విద్యార్థులకు 'టాస్క్' ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆయా కళాశాలల్లోని అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ సాంకేతికతలో ప్రపంచస్థాయి శిక్షణ అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. కార్యక్రమంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, టాస్క్ సీఈవో నితిన్ రెడ్డి, ఏడబ్ల్యూఎస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ సందీప్ దత్తా, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ హెడ్ అభినవ్, కంట్రీ మేనేజర్ (స్కిల్లింగ్ అండ్ సోషల్ ఇంపాక్ట్) ప్రతిభా, ఏడబ్ల్యూఎస్ అకాడమి టీపీఎం ఆకాంక్షరాయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



గ్లోబల్ సప్లై చైన్‌తో పరిశ్రమల అనుసంధానం

- **ఆర్థిక ప్రగతి కేంద్రాలుగా జిల్లాలను తీర్చిదిద్దుతాం**
- **మెగా ఎఫ్‌టీపీ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్, నవంబర్ 2 :

స్థానిక పరిశ్రమలను గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను ఒక ఆర్థిక ప్రగతి కేంద్రంగా (గ్రోత్ ఇంజన్) తీర్చిదిద్దేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో టీ హబ్‌లో సోమవారం నిర్వహించిన మెగా ఎఫ్‌టీపీ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో ఎగుమతుల పాత్ర కీలకమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇండియా వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ (ఎఫ్‌టీఏలు) వల్ల అనేక నూతన వాణిజ్య అవకాశాలు తలుపు తడుతున్నాయన్నారు. వీటిని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలోని పరిశ్రమలు, ఎగుమతిదారులు ముఖ్యంగా ఎంఎసఎంఈలకు మార్గనిర్దేశనం చేస్తామని ఆయన చెప్పారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' ఉత్పత్తులు ఎఫ్‌టీఏ భాగస్వామ్య దేశాలన్నింటికీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాల వారీగా లభించే ప్రత్యేక ఉత్పత్తులను గుర్తించి, వాటి తయారీ, ప్రాసెసింగ్, ఎగుమతులను ప్రోత్సహిస్తామన్నారు. దేశీయ ఆహార అవసరాలు తీరిన తర్వాత మిగిలే వ్యవసాయ ఉత్పత్తులు వృథా కాకుండా ఎగుమతులకు మళ్లించాల్సిన అవసరం ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఎఫ్‌టీఏ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వాలకు, పరిశ్రమలకు కేంద్రం మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, వివిధ జిల్లాల కలెక్టర్లు మనుచౌదరి, ప్రియాంక ఆలా, కుష్బూ గుప్తా, అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

క్లీన్, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

చేసుకోవాలని సూచించారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్‌తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రీన్ ట్యాంకర్లను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని అభిప్రాయపడ్డారు. అందుకే జలమండలి తొలి విడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీతోపాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైనచోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన, తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఏర్పాట్లపై సీఎం సమీక్ష

- **ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ వనరులతో ఏర్పాట్లు**
- **ఆరు నగరాల్లో 20 వేదికలపై పోటీలు**
- **7 వేల మందికిపైగా యువ క్రీడాకారుల రాక**
- **నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి ఆదేశం**

హైదరాబాద్, నవంబర్ 2:

ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026 నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న పోటీల సన్నాహాలపై సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కోసం సమకూర్చే వనరులను ఈ పోటీలకు కూడా వినియోగించుకోవాలని సూచించారు.

రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం పేర్కొన్నారు. పోటీలు ముగిసిన తర్వాత కూడా క్రీడా వేదికలు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు గ్రూప్1, ట్రైనీ అధికారులను నియమించాలని, క్రీడాకారులకు ఆహారం, వసతిలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.ప్రతి వారం పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని సూచించారు.

ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 7 వేల మందికిపైగా యువ క్రీడాకారులు, సుమారు 2 వేల మంది కోచ్‌లు, అధికారులు పాల్గొననున్నారు. హైదరాబాద్‌తోపాటు మరో ఐదు నగరాల్లోని 20 వేదికలపై 27 క్రీడాంశాల్లో పోటీలు, ఒక ప్రదర్శన పోటీ నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రం కోటాలో తెలంగాణ కర్రసాము క్రీడను చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ, అటవీ వివాదాలకు జాయింట్ సర్వేతో ఫుల్‌స్టాప్

హైదరాబాద్, నవంబర్ 2 :



రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదని, రెండు విభాగాలు పూర్తి సమన్వయంతో జాయింట్ సర్వేలు నిర్వహించాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భూ వివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలని, ఈ సర్వేలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సహాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీ భూములు ఉన్నాయని, కొన్ని దశాబ్దాలుగా రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నాయని తెలిపారు. దీంతోపాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్ట్ భూముల మధ్య కూడా వివాదాలు ఉన్నాయని, ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలను సమగ్రంగా సరిపోల్చి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన హద్దులను నిర్ధారించాలన్నారు. ఈ సమస్యలను ఒక శాఖపై మరొక శాఖ బాధ్యతగా నెట్టివేసే ధోరణి విడనాడాలని, పరస్పర సమన్వయంతో పరిష్కార దిశగా అడుగులు వేయాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను అక్కడే పరిష్కరించాలని, ఉన్నతస్థాయి నిర్ణయాలు అవసరమైన అంశాలను వెంటనే రాష్ట్రస్థాయికి నివేదించాలన్నారు. ఏళ్లతరబడి వివాదాలు కొనసాగడం వల్ల రైతులు, భూయజమానులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా, వాస్తవ ఆధారాలతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి నిక్షేపం లేకుండా నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. ఇకపై రెవెన్యూఅటవీ భూ సరిహద్దు వివాదాల పరిష్కార ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు.రెండు శాఖల మధ్య సమన్వయానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తానన్నారు. శాస్త్రీయంగా సరిహద్దులను నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో తిరిగి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వతంగా తెరపడుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు అమలు చేస్తోందని వెల్లడించారు. భూ రికార్డులలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పట్టుదలతో పనిచేసి దశాబ్దాల నాటి భూ వివాదాలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. సర్వేకు క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలు సహకరించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలు

వనపర్తి, నవంబర్ 2 :

కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు అధైర్యపడవద్దని, మరో ఏడాదిన్నర తర్వాత మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రైతులను ఆదుకుంటుందని బీఆర్ ఎస్ ఎల్పీ ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు అన్నారు. రైతులకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించే బాధ్యతను బీఆర్ఎస్ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో ఎండిపోయిన పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని హరీశ్ రావు ఆరోపించారు. సాగు సమయంలో రైతులకు అవసరమైన విద్యుత్ అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం వనపర్తి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు బాధాకరంగా ఉన్నాయని, ఎండిపోయిన పంటలను చూస్తుంటే రైతుల కష్టాలు అర్థమవుతున్నాయని తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వైద్య విద్య. వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో కేసీఆర్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వైద్య కళాశాలలు ఏర్పాటు వల్ల పేద ప్రజలకు వైద్యం అందించే అవకాశాలు పెరిగాయని, స్థానిక విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించే అవకాశం లభించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ హాస్పిటల్స్ లో రోగులకు అవసరమైన మందులు, సూదులు కూడా సరిపడా అందుబాటులో లేవని ఆరోపించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వం హాస్పిటల్స్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

జిల్లా అభివృద్ధిని పట్టించుకోని రేవంత్ రెడ్డి

వనపర్తి జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడంతో జిల్లా అభివృద్ధి వేగంగా జరుగుతుందని ప్రజలు ఆశించారని హరీశ్ రావు అన్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా ప్రజలు ఆయనపై పెట్టుకున్న ఆశలు నెరవేరడం లేదని ఆయన అన్నారు.జిల్లాలో సాగునీటి సమస్యలు, రైతుల ఇబ్బందులు, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితమవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి పరిష్కరించాలని, సాగునీరు అందించే విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.జూరాల ప్రాజెక్టు నుంచి మరో 15 రోజుల పాటు సాగునీరు అందిస్తే రైతుల పంటలు పండే అవకాశం ఉంటుందని హరీశ్ రావు అన్నారు. రైతుల పంటలు ఎండిపోతున్న సమయంలో సాగునీటి సరఫరాను నిలిపివేస్తామని చెప్పి వారిని భయభ్రాంతులకు గురిచేయడం ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. సాగునీటి విడుదల విషయంలో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, పంటలు కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కల్వకుర్తి రిజర్వాయర్ నుంచి ఐదు గంటల పాటు మోటార్లు నడిపించి చెరువులు, కుంటలను నీటితో నింపాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని కోరారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే రైతులకు సాగునీటి అవసరాలు తీరడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కష్టాలను చూసి అధైర్యపడవద్దని హరీశ్ రావు అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సాగునీరు, విద్యుత్, రైతు సంక్షేమంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం, సాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే బీఆర్ఎస్ వారి తరఫున పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధ్యక్షత వహించారు. నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుడు గట్టు యాదవ్ ,గొరైల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, వాకిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌సీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

హైదరాబాద్, నవంబర్ 2 :

ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) 85వ సమావేశాన్ని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. రోడ్లు, భవనాలు శాఖ అధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఐఆర్‌సీ సమావేశంపై కూడా చర్చించారు. 19వ తేదీన ముఖ్య అతిథులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, అన్ని రాష్ట్రాల రోడ్లు భవనాలు శాఖ మంత్రులు, వివిధ దేశాల నుండి, ఇతర రాష్ట్రాల డెలిగెట్స్ హాజరుకానున్నారని తెలిపారు. అతిథులకు వసతి, రవాణాకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది రాకూడదని, అందుకు తగ్గట్టు అంతర్జాతీయ స్థాయిలో ఐఆర్‌సీ సదస్సు ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టి పడేలా, తెలంగాణ ప్రగతి తెలిసే విధంగా ప్రత్యేకంగా 'తెలంగాణ పెవిలియన' ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని మాధ్యమాల్లో ఐఆర్‌సీపై విస్తృత ప్రచారం చేయాలని, ఎయిర్‌పోర్టు, మెట్రో స్టేషన్, రైల్వే స్టేషన్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ప్రదేశాల్లో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక విజువల్ ప్రకటనలు ప్రదర్శించాలని తెలిపారు. దిల్లీ, ముంబై, బెంగళూరు ఎయిర్‌పోర్టు, మెట్రోలో కూడా ప్రకటనలతోపాటు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగే గ్లోబల్ సమ్మిట్ (ఇన్వెస్ట్ తెలంగాణ)కు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రీ 'ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ *గా నిలిచేలా నిర్వహించాలని కూడా సూచించారు. తెలంగాణకు పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బి సెక్రటరీ ఇలంబర్తి, స్పెషల్ సెక్రటరీ గంగాధర్, ఎంఓఆర్‌టీహెచ్ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు లింగారెడ్డి(అడ్మిన్), బి.వి.రావు,వసంత్ నాయక్, ధర్మారెడ్డి, నర్సింగ్ రావు, రాజేందర్, రాజేశ్వర్ రెడ్డి, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.



షర్మిల కుమార్తె వివాహానికి సీఎం రేవంత్‌కు ఆహ్వానం

హైదరాబాద్, నవంబర్ 2:

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తన కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ఆహ్వానించారు. వైఎస్ అంజిలి రెడ్డి, అమెరికాలో స్థిరపడిన డాక్టర్ సోమల రఘురామ్ రెడ్డిల వివాహ రిసెప్షన్ డిసెంబర్ 5న జరగనుంది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, వారి కుమార్తె నైమిషా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని షర్మిల కోరారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.

దిల్లీలో హరిత టపాసులకు సుప్రీం అనుమతి

- **నవంబర్ 7, 8 తేదీల్లోనే అనుమతి**
- **ఉదయం 6–7 గంటలు.. రాత్రి 8–10 గంటల వరకు అవకాశం**
- **పర్యావరణహిత బాణాసంచాకే అనుమతి**
- **ఆస్పత్రులు, వృద్ధాశ్రమాల వద్ద 300 మీటర్ల పరిధిలో నిషేధం**



న్యూఢిల్లీ:

దీపావళి సందర్భంగా దిల్లీఎన్‌సీఆర్ పరిధిలో పర్యావరణహిత బాణాసంచా కాల్చుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే హరిత టపాసులు పేల్చుకోవాలని స్పష్టం చేసింది. ఆ రెండు రోజుల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే బాణాసంచా కాల్చేందుకు అవకాశం కల్పించింది. ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలు, సైలెన్స్ జోన్లుగా ప్రకటించిన ఇతర ప్రాంతాల్లో 300 మీటర్ల పరిధిలో ఎలాంటి టపాసులు పేల్చకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది.



లాలూకు సోనియా పరామర్శ

న్యూదిల్లీ, నవంబర్ 2 :

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దిల్లీలోని ఆర్జేడీ ఎంపీ, లాలూ కుమార్తె మీసా భారతి నివాసానికి వెళ్లిన సోనియా గాంధీ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూపీఏ పాలనా కాలం నాటి. జ్ఞాపకాలను, విధానాలను ఇద్దరు నేతలు గుర్తు చేసుకున్నారు.

ఆస్పత్రుల భవనాల పనులు ఏడాది చివరికి పూర్తి చేయాలి

- **నిర్మాణంలో ఉన్న సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులపై సమీక్ష**
- **ఇప్పటికే 9 ఆస్పత్రుల భవనాల నిర్మాణం పూర్తి**
- **డిసెంబర్ నాటికి మరో 14 భవనాలు సిద్ధం**
- **వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం**



హైదరాబాద్, నవంబర్ 2:

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల భవనాల పనులన్నింటినీ వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లోనే 90 శాతం మంది రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో ఈ ఆస్పత్రులు కీలకమని పేర్కొన్నారు.

ఇప్పటికే 9 ఆస్పత్రుల భవనాలు పూర్తయ్యాయని, డిసెంబర్ నాటికి మరో 14, 2027 మార్చి నాటికి ఇంకో 11 భవనాలు అందుబాటులోకి వస్తాయని టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్ వివరించారు. మరో 45 భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పూర్తయిన భవనాల్లో వెంటనే వైద్య పరికరాలు, ఫర్నీచర్ ఏర్పాటు చేసి సేవలు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. మిగిలిన భవనాలకు అవసరమైన సామగ్రి కొనుగోలును ముందుగానే చేపట్టాలన్నారు. గత మూడేళ్లలో వైద్యశాఖలో సుమారు 15 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, డీఎస్‌హెచ్ పరిధిలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించామని మంత్రి తెలిపారు. కొత్త భవనాలు, ఆధునిక పరికరాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే బాధ్యత ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, డీసీహెచ్ఎస్‌లపై ఉందన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆస్పత్రుల్లో తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, గౌరవ్ ఉప్పల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్లలో ఏఐ విప్లవానికి శ్రీకారం

- **డిజిటల్ మార్కెట్ యార్డులతో అక్రమాలకు చెక్**
- **రైతులకు గిట్టుబాటు ధర, వ్యాపారంలో పూర్తి పారదర్శకతే లక్ష్యం**
- **వారం రోజుల్లో టెండర్లు పిలవాలి**
- **కోహెడ్ మార్కెట్ నిర్మాణంలో వేగం పెంచాలి**
- **అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు**




హైదరాబాద్, నవంబర్ 2:

దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డిజిటల్ మార్కెట్ యార్డ్ వ్యవస్థను రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతు పండించిన పంటకు సరైన ధర లభించడంతోపాటు మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా జరిగేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు మార్కెట్ యార్డులోకి ప్రవేశించినప్పటి నుంచి పంట విక్రయించి, చెల్లింపులు పొంది, మార్కెట్ నుంచి బయటకు వెళ్లే వరకు ప్రతి దశను ఒకే డిజిటల్ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. రైతు వివరాల నమోదు, ప్రతి పంట లాట్‌కు ప్రత్యేక ఐడీ కేటాయింపు, డిజిటల్ బిడ్డింగ్ లేదా టెండర్ నమోదు, పంట నాణ్యత పరీక్ష(అసేయింగ్), ఆన్‌లైన్ వేలం, ధర నిర్ణయం, రైతు అంగీకారం, పంట తూకం, అమ్మకపు బిల్లుల తయారీ, మార్కెట్ చార్జీల లెక్కింపు, రైతులకు చెల్లింపులు, గేట్ ఎగ్జిట్ నమోదు, ఈరశీదులు, ఈపర్మిట్ల జారీ వరకు అన్ని ప్రక్రియలు ఒకే వేదికపై నిర్వహించేలా వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు.

ఈ విధానంలో రైతు మార్కెట్ యార్డుకు రాగానే అతని వివరాలు నమోదు చేసి పంటకు ప్రత్యేకమైన లాట్ ఐడీ కేటాయిస్తారు. అనంతరం పంట నాణ్యతను పరీక్షించి సంబంధిత వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తారు. వ్యాపారులు ఆన్‌లైన్‌లో లాట్ వివరాలను పరిశీలించి తమ బిడ్లను నమోదు చేస్తారు. వేలం లేదా టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత నిర్ణయించిన ధరను వ్యవస్థలో ప్రకటిస్తారు. కమీషన్ ఏజెంట్ ద్వారా రైతుకు ఓటీపీ పంపి రైతు ధరను నిర్ధారించిన తర్వాత తదుపరి ప్రక్రియ ప్రారంభమవుతుంది. పంట తూకం వేసి, నమోదైన బరువు, ఖరారైన ధర ఆధారంగా కమీషన్ ఏజెంట్ లేదా మార్కెట్ కమిటీ అమ్మకపు బిల్లును రూపొందిస్తుంది. మార్కెట్ చార్జీలు, రైతుకు చేసిన చెల్లింపుల వివరాలు నమోదు చేసి అన్ని ప్రక్రియలు పూర్తయిన అనంతరం గేట్ ఎగ్జిట్ ద్వారా ఈరశీదులు, ఈపర్మిట్లు జారీ చేస్తారు. మార్కెట్ యార్డుకు వచ్చిన పంట వివరాలు, ధరల ధోరణులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల కార్యకలాపాలు, వేలం వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) రూపొందించాలని మంత్రి తుమ్మల సూచించారు. గతంలో జరిగిన వేలం, లావాదేవీల వివరాలను భద్రపరిచి అవసరమైనప్పుడు విశ్లేషణలు, తనిఖీల కోసం తిరిగి పొందేలా చూడాలన్నారు. వివిధ దశల్లో నమోదయ్యే సమాచారం స్వయంచాలకంగా అనుసంధానమయ్యేలా సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని తెలిపారు.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న డిజిటల్ మార్కెట్ వ్యవస్థలను అధ్యయనం చేసి, వాటికంటే మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణలో ఆదర్శవంతమైన వ్యవస్థను తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారుల హాజరు, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను కూడా ఈ డిజిటల్ వ్యవస్థలో భాగంగా చేయాలని సూచించారు. ఐటీ శాఖతో సమన్వయం చేసుకొని వారం రోజుల్లోగా టెండర్లు పిలిచే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో డిజిటల్ వ్యవస్థతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, గోదాముల నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లలో పంటలకు లభిస్తున్న ధరలను ప్రదర్శించాలన్నారు. అధికంగా వ్యాపార లావాదేవీలు జరిగే మార్కెట్ యార్డుల్లో తొలుత ఈ సదుపాయాలను ఏర్పాటు చేసి క్రమంగా రాష్ట్రంలోని అన్ని మార్కెట్లకు విస్తరించాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకొని ప్రతి లావాదేవీకి జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

కోహెడ మార్కెట్ పనులు వేగిరం చేయాలి

కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ ప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ ప్రతినిధులు సూచించిన భూమి చదును సవరణలపై ముఖ్యమంత్రిగారి ఆమోదం తీసుకొని, వచ్చే వారం రోజుల్లోగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే మార్చి నాటికి మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేసి, మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సదుపాయాలతో కూడిన సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టి, పనుల వేగాన్ని పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి పదోన్నతి శిక్షణ షురూ

- **మూడు శిక్షణ కళాశాలల్లో 1,435మందికి ప్రారంభం**

హైదరాబాద్, నవంబరు 2:

రాష్ట్ర పోలీసు శాఖలో 1,435 మంది సిబ్బందికి పదోన్నతికి ముందస్తు శిక్షణ సోమవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని మూడు పోలీసు శిక్షణ కళాశాలల్లో (పీటీసీ) సివిల్, ఆర్‌మ్డ్ రిజర్వ్ విభాగాలకు చెందిన సిబ్బందికి ఈ శిక్షణ ఇస్తున్నారు. వీరిలో 899 మంది సివిల్, 536మంది ఏఆర్ విభాగానికి చెందినవారు ఉన్నారు. మేడ్చల్ పీటీసీలో సివిల్ విభాగంలో 586మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కోసం శిక్షణ ప్రారంభించారు. కరీంనగర్ పీటీసీలో 313మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి శిక్షణ ఇస్తున్నారు. ఆర్‌మ్డ్ రిజర్వు లో వరంగల్ పీటీసీలో 302మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా, 176మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆరఎస్సైలుగా పదోన్నతి శిక్షణ ప్రారంభమైంది. కరీంనగర్ పీటీసీలో మరో 58 మంది ఏఆరఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి శిక్షణ ఇస్తున్నారు. మేడ్చల్ పీటీసీలో జరిగిన కార్యక్రమానికి సాంకేతిక సేవలు, శిక్షణ విభాగం అదనపు డీజీపీ డాక్టర్ అకున్ సబర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత పాల్గొన్నారు. ఉన్నత హోదాల్లో బాధ్యతలు చేపట్టనున్న సిబ్బందికి వృత్తిపరమైన పరిజ్ఞానం, విధి నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ శిక్షణ లక్ష్యమని అధికారులు తెలిపారు.

పేదలకు 24 గంటలూ ఉచిత న్యాయసేవలు

- వైద్యసేవల తరహాలో న్యాయసాయం అందాలి
- అణగారిన వర్గాలకు అడ్డంకులు లేని సేవలు
- బాధితులకు తక్షణ న్యాయ పరిష్కారం కల్పించాలి
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పిలుపు



దేవ్‌ఘర్:

దేశంలోని పేదలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించిన తరహాలోనే 24 గంటలూ ఉచితంగా, సులభంగా న్యాయసేవలు అందుబాటులో ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ సామాన్యులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి న్యాయసేవలుసాధికారత సదస్సులో ఆయన ప్రసంగించారు. అణగారిన వర్గాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరం ఉచిత న్యాయసాయం అందించేలా సంబంధిత వ్యవస్థలు పనిచేయాలని స్పష్టం చేశారు.

బాధితుల సమస్యలను గుర్తించాలి

తాలూకా, జిల్లా కోర్టుల నుంచి హైకోర్టులు, సుప్రీంకోర్టు వరకు న్యాయవ్యవస్థలోని ప్రతి విభాగం పేద ప్రజల సమస్యలు, బాధలను అర్థం చేసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆలస్యం చేయకుండా వైద్యం అందించినట్లే, న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు కూడా సత్వర పరిష్కారం చూపాలని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పరిస్థితుల కారణంగా ఎవరూ న్యాయసేవలకు దూరం కాకూడదని పేర్కొన్నారు.

సమాజంలోని చివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా న్యాయవ్యవస్థపై విశ్వాసం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడంతోపాటు అవసరమైనప్పుడు ఉచిత న్యాయసహాయం అందించాలని అన్నారు. న్యాయసేవా అధికార సంస్థలు మరింత సమర్థంగా పనిచేస్తూ బాధితులకు సకాలంలో న్యాయం అందించే దిశగా కృషి చేయాలని సీజేఐ పిలుపునిచ్చారు.




ఒమర్–నిధి వివాహంపై చెల్లదు

- వధూవరులిద్దరూ ముస్లింలై ఉండాలి
- నిధి రజ్దాన్ ఇస్లాంలోకి మారాల్సిందని సూచన
- ఆల్ ఇండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా రజ్వీ

జమ్మూ, నవంబర్ 2:

జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జర్నలిస్ట్ నిధి రజ్దాన్ వివాహంపై మతపరమైన చర్చ మొదలైంది. ఇస్లామిక్ మత నియమాల ప్రకారం వీరి వివాహం చెల్లుబాటు కాదని ఆల్ ఇండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ వ్యాఖ్యానించారు. షరియా నిబంధనల ప్రకారం నికాహ్ జరగాలంటే వధూవరులిద్దరూ ముస్లింలై ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఒమర్ అబ్దుల్లా ముస్లిం అయినప్పటికీ, నిధి రజ్దాన్ ముస్లిం కాదని, అందువల్ల ఈ వివాహాన్ని ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం ఆమోదించలేమని అన్నారు.

నిధి రజ్దాన్ వివాహానికి ముందు ఇస్లాంలోకి మారి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని రజ్వీ అభిప్రాయపడ్డారు. మత మార్పిడి అనంతరం ఇస్లామిక్ ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం నికాహ్ నిర్వహించి ఉంటే షరియా నిబంధనలకు అనుగుణంగా ఉండేదని పేర్కొన్నారు. వివాహానికి సంబంధించి ఇస్లాంలో నిర్దిష్టమైన నియమాలు, షరతులు ఉన్నాయని వివరించారు. దంపతుల్లో ఒకరు ముస్లిం కాకపోతే ఆ వివాహాన్ని మతపరంగా చెల్లుబాటైనదిగా పరిగణించలేమని చెబుతూ, ఒమర్-నిధి వివాహాన్ని 'నాజాయిజ్'గా అభివర్ణించారు.



పసిడి ప్రియులకు మళ్లీ ధరల షాక్

- స్వల్పంగా పెరిగిన బంగారం, వెండి ధరలు!
- దీపావళి పండుగ వేళ పెరుగుతున్న కొనుగోళ్లు
- ఆఫర్లు, జీరో మేకింగ్ ఛార్జీలతో వినియోగదారులను ఆకర్షిస్తున్న దుకాణాలు

హైదరాబాద్, నవంబర్ 2:

ఇటీవల రికార్డు స్థాయికి చేరిన బంగారం ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్న పసిడి ప్రియులకు మళ్లీ ధరల షాక్ తగిలింది. సోమవారం దేశవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. దీపావళి పండుగ సమీపిస్తుండటంతో బంగారు ఆభరణాల కొనుగోలుకు ప్రజలు. తీవ్ర ఆసక్తి చూపుతున్నారు. ఈ తరుణంలో అమ్మకాలను పెంచుకునేందుకు నగల దుకాణాల యజమానులు జీరో మేకింగ్ ఛార్జీలు, లక్కీ డ్రాలు, ప్రత్యేక డిస్కౌంట్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, అమెరికా డాలర్ బలోపేతం కావడం, బాండ్ ఈల్డ్స్ పెరగడం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నెలకొన్న అంచనాలు బంగారం ధరల కదలికలకు ప్రధాన కారణాలుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు ఈ ఏడాది ప్రారంభం నుంచి పసిడి ధరలు భారీగా పెరగడంతో కొంతమంది ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపుతున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రధాన నగరాల్లో ధరల వివరాలు

హైదరాబాద్ /విజయవాడ విశాఖపట్నం: 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం: రూ.1,39,370 (రూ.490 పెరిగింది).

22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం: రూ.1,27, 750 (రూ.450 పెరిగింది)

న్యూదిల్లీలో : 24 క్యారెట్ల 10 గ్రాములు: రూ. 1,39,520, 22 10: 2, 1,27,900

చెన్నై / బెంగళూరు : 24 క్యారెట్ల 10 గ్రాములు: రూ.1,39,370

స్వచ్ఛ ఇంధనంతోనే దేశ ఆర్థిక భద్రత

- శిలాజ ఇంధనాలపై అధిక ఆధారపడటం ప్రమాదకరం
- పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం 300 గిగావాట్లకు చేరువ
- 2025లోనే 50 శాతం శిలాజేతర విద్యుత్ లక్ష్యం సాధన
- భారత్ రెన్యువబుల్ ఎనర్జీ సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ:

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాలపై అధికంగా ఆధారపడటం ఆర్థిక వ్యవస్థలను సంక్షోభంలోకి నెడుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంధన భద్రతకు స్వచ్ఛ ఇంధన వనరులే కీలకమని స్పష్టం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 'భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో-2026'ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న సంక్షోభాలు ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయని మోదీ అన్నారు. శిలాజ ఇంధన నిల్వలు కొన్ని ప్రాంతాలకే పరిమితమైతే, సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక వనరులు అన్ని దేశాలకూ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రతి ప్రాంతం తనకున్న సహజ వనరులను వినియోగించుకుని స్వచ్ఛ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందన్నారు.

దేశీయ పెట్టుబడులతో సంక్షోభాలను ఎదుర్కొన్నాం

గత పదేళ్లలో దేశీయ పెట్టుబడులను పెంచడంతోపాటు కీలక కార్యక్రమాలను అమలు చేయడం వల్ల అంతర్జాతీయ పరిణామాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పరిమితంగా ఉందని ప్రధాని తెలిపారు. జలవిద్యుత్, సౌర, పవన, అణు విద్యుత్‌తోపాటు గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ భారత్ సామర్థ్యాన్ని పెంచుకుంటోందని చెప్పారు.

పారిస్ ఒప్పందం ప్రకారం మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 50 శాతానికి పైగా శిలాజేతర వనరుల వాటా ఉండాలన్న లక్ష్యాన్ని 2030 నాటికి సాధించాలని భారత్ నిర్ణయించిందని గుర్తుచేశారు. అయితే నిర్దేశిత గడువుకు ఐదేళ్ల ముందుగానే, 2025లోనే ఈ మైలురాయిని చేరుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ విద్యుత్ సామర్థ్యంలో శిలాజేతర వనరుల వాటా 50 శాతానికి మించిందన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే దాదాపు 300 గిగావాట్ల స్థాయికి చేరుకున్నామని తెలిపారు. రాబోయే పదేళ్లలో అదనంగా మరో 500 గిగావాట్ల శిలాజేతర విద్యుత్ సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం తదుపరి లక్ష్యమని పేర్కొన్నారు.



సూర్య ఘర్‌తో 65 లక్షల ఇళ్లకు లబ్ధి

గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు 2024 ఫిబ్రవరిలో ప్రారంభించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా ఇప్పటివరకు 65 లక్షలకుపైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని మోదీ తెలిపారు. ఈ పథకం కింద కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సౌర విద్యుత్ వినియోగం వల్ల లబ్ధిదారుల విద్యుత్ బిల్లులు సగటున 76 శాతం మేర తగ్గాయని వెల్లడించారు.

పీఎం కుసుమ్ పథకం ద్వారా 30 లక్షలకుపైగా రైతులు సౌర విద్యుత్ వ్యవస్థల ప్రయోజనం పొందుతున్నారని ప్రధాని వివరించారు. ఈ పథకం వల్ల ఒక్కో రైతుకు ఏడాదికి సుమారు రూ.లక్ష వరకు ఆదా అవుతోందని అంచనా వేశారు. అలాగే 44 వేలకుపైగా ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థల ద్వారా ఏటా దాదాపు రూ.700 కోట్లు ఆదా అవుతున్నాయని తెలిపారు.

డ్రగ్స్ కేసులో ఇరికించే యత్నం.. ఏఎస్ఐ సస్పెండ్

- శివసేన నేత ఇంట్లో పరుపు కింద హెరాయిన్
- రహస్య కెమెరాలో రికార్డైన పోలీసు అధికారి చర్యలు
- నేతను అరెస్ట్ చేసిన తర్వాత వెలుగులోకి వీడియో
- ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్‌పై వేటు.. విచారణకు ప్రత్యేక బృందం

చండీగఢ్, నవంబర్ 2:

పంజాబ్‌లోని ఖన్నాలో ఓ శివసేన నాయకుడిని మాదకద్రవ్యాల కేసులో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మహంత్ కశ్మీర్ గిరి ఇంట్లోని పరుపు కింద హెరాయిన్ పెట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్ వ్యవహారం రహస్య కెమెరా వీడియోతో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై స్పందించిన ఖన్నా ఎస్ఎస్పీ డాక్టర్ దర్పణ్ అహ్లువాలియా సంబంధిత ఏఎస్ఐని సస్పెండ్ చేశారు. విచారణకు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. కేసులో అరెస్టయిన మహంత్ కశ్మీర్ గిరిని విడుదల చేశారు. ఖన్నాలోని ఖతీకా చౌక్ సమీపంలో నివసించే మహంత్ కశ్మీర్ గిరి డ్రైవర్ గుర్జంట్ సింగ్ జంటాను తొలుత 7.5 గ్రాముల హెరాయిన్‌తో అరెస్ట్ చేసినట్లు పోలీసులు ప్రకటించారు. అతడిని విచారించిన అనంతరం మహంత్ కశ్మీర్ గిరి పేరు బయటకు వచ్చిందని, అయన ఇంట్లో సోదాలు నిర్వహించగా పరుపు కింద సుమారు 30 గ్రాముల హెరాయిన్ లభించిందని వెల్లడించారు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

అయితే ఇంట్లోని రహస్య కెమెరాలో నమోదైన దృశ్యాలు ఈ కేసులో కీలకంగా మారాయి. పోలీసు బృందం రాకముందే సీఐఏ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్ సాధారణ దుస్తుల్లో ఇంట్లోకి వెళ్లినట్లు వీడియోలో కనిపిస్తోంది. గదిలోకి వెళ్లిన ఆయన పరుపు కింద ఏదో వస్తువు ఉంచినట్లు దృశ్యాలు నమోదయ్యాయి. ఆ తర్వాతే పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించి హెరాయిన్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.

వీడియో బయటకు రావడంతో పోలీసుల సోదాల తీరుపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణించిన ఎస్ఎస్పీ డాక్టర్ దర్పణ్ అహ్లువాలియా ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది

రష్యా యుద్ధక్షేత్రంలో ఐదుగురు తెలుగు యువకులు

- ఉద్యోగాల పేరుతో మోసం చేసి యుద్ధంలోకి
- ఫుడ్ ప్యాకింగ్ పనులంటూ నమ్మించిన ఏజెంట్
- ప్రాణభయంతో సెల్ఫీ వీడియో విడుదల
- స్వదేశానికి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేడుకోలు

విశాఖపట్నం, నవంబర్2:

ఉపాధి కోసం రష్యా వెళ్లిన ఐదుగురు తెలుగు యువకులు అక్కడి యుద్ధక్షేత్రంలో చిక్కుకుని ప్రాణభయంతో కాలం వెళ్లదీస్తున్నారు. వీరిలో విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులు ఉన్నారు. రష్యా సైన్యంలో ఫుడ్ ప్యాకింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నేపాల్‌కు చెందిన ఓ ఏజెంట్ నమ్మించి తీసుకెళ్లినట్లు బాధితులు చెబుతున్నారు. అక్కడికి చేరుకున్నాక నకిలీ ఒప్పందాలతో మోసం చేసి, రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులోని యుద్ధ ప్రాంతానికి బలవంతంగా పంపించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధ క్షేత్రంలో చిక్కుకున్న యువకులు తాజాగా విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో తమ దీనస్థితిని వివరించారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో బతుకుతున్నామని, తమకు ఇదే చివరి రోజు కావచ్చని కన్నీటి పర్యంతమయ్యారు. బాంబుల పేలుళ్లు, తుపాకుల మోతల మధ్య ప్రతి క్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని వాపోయారు.



సురక్షితంగా బయటపడతామో లేదో కూడా తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాల పేరుతో తమను మోసగించి యుద్ధంలోకి నెట్టేశారని, వెంటనే స్పందించి కాపాడాలని భారత ప్రభుత్వాన్ని బాధితులు వేడుకుంటున్నారు. విదేశాంగ శాఖ అధికారులు దౌత్యపరమైన చర్యలు చేపట్టి తమను స్వదేశానికి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు విశాఖపట్నానికి చెందిన యువకుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తమ పిల్లలను క్షేమంగా వెనక్కి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు.

డీప్‌ఫేక్ కంటెంట్‌పై కఠిన చట్టాలు తీసుకురావాలి

- ఏఐ దుర్వినియోగంతో సినీ ప్రముఖుల ప్రతిష్ఠకు భంగం
- నటీమణులపై అసభ్యకర కంటెంట్ సృష్టిస్తున్న వైనం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు చిరంజీవి విజ్ఞప్తి
- పూర్తి వివరాలతో వినతిపత్రం ఇవ్వాలని సూచన

హైదరాబాద్, నవంబర్ 2:

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సినీ ప్రముఖుల ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మెగాస్టార్ చిరంజీవి కోరారు. ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చట్టాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ భేటీ అయ్యారు. బీజేపీ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అమిత్ షాను బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో వారు కలిశారు.

ప్రస్తుతం డీప్‌ఫేక్, మార్ఫింగ్ వంటి సాంకేతిక పద్ధతులతో కొందరు సినీ ప్రముఖుల ఫొటోలు, వీడియోలను మార్పులు చేసి అభ్యంతరకరమైన కంటెంట్ రూపొందిస్తున్నారని చిరంజీవి వివరించినట్లు సమాచారం. ముఖ్యంగా నటీమణులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర దృశ్యాలు సృష్టించడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల కళాకారుల వ్యక్తిగత గౌరవం, ప్రతిష్ఠ దెబ్బతినడంతోపాటు వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టాలీవుడ్ మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారానికి సమగ్ర చట్టపరమైన చర్యలు అవసరమని అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు.



చిరంజీవి వివరించిన అంశాలను అమిత్ షా శ్రద్ధగా విన్నట్లు తెలిసింది. ఏఐ సాంకేతికతను ఉపయోగించి మహిళలు, కళాకారుల గౌరవానికి భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకునే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలని చిరంజీవికి సూచించారు. సంబంధిత అంశాలపై సమన్వయం చేసుకునే బాధ్యతను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి అప్పగించారు.

అమిత్ షా సానుకూలంగా స్పందించడంపై చిరంజీవి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేంద్రం ఈ సమస్యపై చర్యలు చేపడితే సినీ పరిశ్రమకు ఉపశమనం కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి అమిత్ షాను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

బంగ్లాదేశ్‌లో గార్మెంట్ కార్మికుల ఆందోళనలు హింసాత్మకం

ఢాకా, నవంబర్2:

బంగ్లాదేశ్‌లో గార్మెంట్ పరిశ్రమ కార్మికుల ఆందోళనలు తీవ్ర హింసకు దారితీశాయి. అధిక వేతనాలు కోరుతూ అక్టోబర్ 31న ప్రారంభమైన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. గజీపూర్, మీర్‌పూర్, సవార్ ప్రాంతాల్లో కార్మికులు జాతీయ రహదారులను దిగ్బంధించారు. పోలీసులతో ఘర్షణలకు దిగడంతోపాటు వాహనాలు, గిడ్డంగులు, ఫ్యాక్టరీలకు నిప్పంటించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. ఆందోళనల కారణంగా వందలాది పరిశ్రమలు మూతపడగా, సుమారు 10 లక్షల మంది కార్మికులు విధులకు దూరమయ్యారు.

ప్రస్తుతం నెలకు 12,500 టాకాలుగా ఉన్న కనీస వేతనాన్ని 30 వేల టాకాలకు పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన ఆహారం, ఇళ్ల అద్దెలు, రవాణా ఖర్చులతో ప్రస్తుత వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవామీ లీగ్‌పై ప్రభుత్వ ఆరోపణలు

ఈ ఆందోళనల వెనుక రాజకీయ కుట్ర ఉందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ కార్యకర్తలు గార్మెంట్ పరిశ్రమను దెబ్బతీసేందుకు నిరసనలను ప్రేరేపిస్తున్నారని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

పేదలకు భరోసాగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్
- నంగునూరులో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



నంగునూరు, నవంబర్ 02, :

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ అన్నారు. నంగునూరు గ్రామానికి చెందిన కొండిల స్రవంతి భర్త వెంకటేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఆయన సోమవారం అందజేశారు. మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ సహకారంతో ఈ ఆర్థిక సాయం మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, జీవన్ నాయక్, పిడిచెట్టి ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, గడ్డం కరుణాకర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, లింగంపల్లి అజయ్, చిర్రం భాను, ప్రశాంత్, శంకరయ్యతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరుగుపందెంలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
- జిల్లా, ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం
- రెండు బంగారు పతకాలు కైవసం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

క్రీడల్లోనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. సిద్దిపేటలో గత నెల 31న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి డి దినేష్ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీల్లో తొలుత సిద్దిపేట జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న దినేష్, అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలోనూ మొదటి స్థానంలో నిలిచి మరో బంగారు పతకాన్ని సాధించాడు. వరుస విజయాలతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, సీనియర్ ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజమోహన్ గౌడ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం దినేష్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రథమ స్థానం సాధించి పాఠశాలతో పాటు సిద్దిపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీదేవి, రాజు, సాగర్, శ్రీనివాస్, సుజాత, శకుంతల, జంపయ్య, జ్యోత్స్న, బాలవాణి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో డిసెంబర్ 6న అయ్యప్ప మహా పడిపూజ

- లోక కళ్యాణార్థం మహా పడిపూజ
- స్వామీజీ ఉన్నికృష్ణన్ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

లోక కళ్యాణం, ప్రజల సుఖసంతోషాలను ఆకాంక్షిస్తూ సిద్దిపేటలో డిసెంబర్ 6న అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు మణికంఠ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ స్వామీజీ ఉన్నికృష్ణన్ చేతుల మీదుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ రఘునందన్‌రావుతో పాటు పలువురు సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. మహా పడిపూజ అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయ్యప్ప స్వాముల భక్తి పారవశ్యంతో జరిగే ఈ మహా పడిపూజ కార్యక్రమానికి గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మణికంఠ అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మణికంఠ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ప్రధానోపాధ్యాయుడు

- తరగతి గదిలోనే ఎంచక్కా నిద్ర
- మద్యం సేవించి పాఠశాలకు వస్తున్నారంటూ కలెక్టరేట్‌లో ఫిర్యాదు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయుడి తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేడిపల్లి మండలం కమలానగర్‌లోని శ్రీఎంపీపీఎస్ ప్రధానమంత్రి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారని, విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలోని తరగతి గదిని వ్యక్తిగత విశ్రాంతి గదిగా ఉపయోగించుకుంటూ, టేబుల్‌పై కాళ్లు పెట్టుకుని నిద్రిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతిరోజూ డైనింగ్, బెడ్‌రూమ్‌లా తరగతి గదిని వినియోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద ఎంపికైన పాఠశాలలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) స్పందించి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

యాదమ్మకు కమిషనర్ పరామర్శ

ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. అండగా ఉంటామని భరోసా..



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

సిద్దిపేట పట్టణంలోని 17వ వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికురాలు నాయిని యాదమ్మ ప్రమాదవశాత్తు గాయపడి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సోమవారం ఆసుపత్రికి వెళ్లి యాదమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ యాదమ్మతో మాట్లాడి ఆమెకు ధైర్యం చెప్పారు. ప్రమాదం గురించి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, వారి సంక్షేమానికి మున్సిపల్ యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యాదమ్మకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా జనగామ శ్రీనివాస్



గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), నవంబర్ 02, :

సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం గజ్వేల్ నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన జనగామ శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరిటాల రవికుమార్ గౌడ్ చేతుల మీదుగా సోమవారం నియామక పత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనగామ శ్రీనివాస్ మాట్లాడుతూ గీత కార్మికుల ఐక్యత, హక్కుల సాధన వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎంపికైన శ్రీనివాస్‌కు సంఘం నాయకులు, పలువురు అభినందనలు తెలిపారు.

సొంత ఖర్చులతో గ్రామ పంచాయతీకి కుర్చీలు, స్టీల్ బ్యాంక్ అందజేత

ఎల్లాయగూడ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం ముందడుగు



గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), నవంబర్ 02, :

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఎల్లాయగూడ గ్రామ పంచాయతీ పాలకవర్గం ముందడుగు వేసింది. సోమవారం సర్పంచ్ సున్నం సుదర్శన్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం పాలకవర్గ సభ్యులందరూ తమ సొంత ఖర్చులతో గ్రామ పంచాయతీకి 20 కుర్చీలు కొనుగోలు చేసి అందజేశారు. అలాగే గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే లక్ష్యంతో గ్రామ పంచాయతీకి స్టీల్ బ్యాంక్‌ను కొనుగోలు చేసి అందించారు. గ్రామ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ సున్నం సుదర్శన్, వార్డు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాసపాక జానీ, వార్డు సభ్యులు ముత్తయ్య, ప్రవీణ్, కర్ణాకర్, మహేశ్వరి, కనుకమ్మ, అనూష, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామస్తులు లక్ష్మణ్, అశోక్, యాదగిరి, నర్సింలు పాల్గొన్నారు.

సతీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 02, :

బీఆర్ఎస్ నాయకులు సతీష్ రావు జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన జన్మదిన వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై సతీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సతీష్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

ఆదివాసి జేఏసీ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- మండల అధ్యక్షుడిగా సోయం మోహన్, ప్రధాన కార్యదర్శిగా తోలేం శీను ఎన్నిక



దమ్మపేట, నవంబర్ 02, :

దమ్మపేట మండల కేంద్రంలో సోమవారం ఆదివాసి జేఏసీ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా సోయం మోహన్, ప్రధాన కార్యదర్శిగా తోలేం శీను, ప్రచార కార్యదర్శిగా సున్నం శ్రీను, కోశాధికారిగా కారం నాగేంద్రబాబు ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శులుగా పద్ధం విజయలక్ష్మి, గడ్డం వెంకటరమణ ఎన్నిక కాగా, మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సీనియర్ జేఏసీ నాయకులు బండారు సూర్యనారాయణ, కొర్సా వెంకటేష్ దొర, గడ్డం వెంకటేశ్వరరావు, కుంజా చిన్నబాబు, తాళ్ల దుర్గయ్య, వాసం వెంకటేశ్వరరావు, మడకం ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు సోయం మోహన్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనతో పాటు చట్టాల పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. నవంబర్ 12వ తేదీన దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలంలోని ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఆదివాసీలను సమీకరిస్తామని తెలిపారు.

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

- ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి
- తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తామని బీజేపీ నేతల వెల్లడి



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 02, :

చార్మినార్ వద్ద కొలువై ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడేందుకు బీజేపీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని వెల్లడించారు.

పెండింగ్‌లో పెట్టకుండా ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

- 30 రోజుల్లో చర్యలు తీసుకోకపోతే సంబంధిత శాఖలకు జరిమానా విధిస్తాం
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 123 అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను విని వాటికి పరిష్కారం చూపేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు ప్రజావాణికి వస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులపై 30 రోజుల్లోగా చర్యలు తీసుకోని సంబంధిత శాఖలపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరా వ్యవస్థను సమీక్షించి నల్లాలు, పైపులైన్ల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడా నీటి లీకేజీలు జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు నీటిని పొదుపుగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్వో నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్సీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

- పరిశుభ్రత నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు
- వ్యర్థాల సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన డ్రై రిసోర్స్ కంట్రోల్ సెంటర్ (డీఆర్సీసీ)ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ తో కలిసి సోమవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న వ్యర్థాల సేకరణ, వేరు



చేయడం, నిల్వ చేయడం, నిర్వహణ ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రం నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కమిషనర్ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, పొడి వ్యర్థాలను పునర్వినియోగానికి అనువుగా శాస్త్రీయ పద్ధతిలో వర్గీకరించాలని సూచించారు. కేంద్రంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, వ్యర్థాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజల్లోనూ చెత్త వేరు చేసే అలవాటుపై అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ, మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు ఆర్థిక భరోసా

- ముగ్గురు కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5.10 లక్షల బీమా చెక్కులు అందజేత

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం చెందిన పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబాలకు పోలీసు శాఖ అండగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర పోలీసు సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన గ్రూప్ వ్యక్తిగత ప్రమాద బీమా పరిహారం కింద ముగ్గురు మృత పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఒక్కొక్కరికి



రూ.5.10 లక్షల చొప్పున చెక్కులను సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సోమవారం అందజేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుళ్ల పరంధాములు, వెంకటేశం, నవీన్ కుమార్ కుటుంబ సభ్యులకు కమిషనర్ కార్యాలయంలో ఈ చెక్కులను అందించారు. ముగ్గురి కుటుంబాలకు కలిపి మొత్తం రూ.15.30 లక్షల బీమా పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. వారి కుటుంబాలను ఆదుకోవడంలో పోలీసు సంక్షేమ విభాగం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు పోలీసు శాఖ అన్ని వేళలా అండగా ఉంటుందని, వారికి అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, శాఖాపరమైన సహాయ సహకారాలను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి రమాదేవి, సూపరింటెండెంట్ అలీషా నిమ్మల, జూనియర్ అసిస్టెంట్ రవి రాజు తదితరులు పాల్గొన్నారు.

ముహమ్మద్ వహీదుద్దీన్‌కు 'గురుబ్రహ్మ' అవార్డు

- విద్య, సాహిత్య రంగాల్లో విశేష సేవలకు అరుదైన గుర్తింపు
- పలువురి అభినందనలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, ఉపాధ్యాయుడు ముహమ్మద్ వహీదుద్దీన్‌కు అరుదైన గౌరవం దక్కింది. విద్యా, సాహిత్య రంగాల్లో అందిస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ–ఇండియా' 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన 'గురుబ్రహ్మ' అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేడుకలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ముహమ్మద్ వహీదుద్దీన్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు, ఎఫ్‌సీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, ఈనాడు కాలమిస్ట్ పెంటపాటి కృష్ణాది శేషు, సీనియర్ యోగా ఆచార్యులు, ప్రముఖ పాత్రికేయులు కోటేశ్వరరావు, హైదరాబాద్ సేవా సదన్ సంస్థ అధ్యక్షుడు గూడూరు శ్రీధర్ రెడ్డి, రచయిత, సినీ నిర్మాత ఉమాశంకర్ రెడ్డి, ఎల్బీనగర్ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్రబాబు, ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ మాస్టర్, ప్రధాన కార్యదర్శి, టీవీ కొరియోగ్రాఫర్ సూర్య తేజ మాస్టర్ తదితరులు పాల్గొని అవార్డును అందజేశారు. ముహమ్మద్ వహీదుద్దీన్ ఈ గౌరవాన్ని అందుకోవడం పట్ల సిద్దిపేటకు చెందిన ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు, మిత్రులు,



శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను అభినందిస్తూ భవిష్యత్తులో విద్య, సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో మరిన్ని విశేష సేవలందించి మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి కర్షక రత్నం అవార్డుకు జక్కుల కనకయ్య ఎంపిక

- నవంబర్ 15న న్యూఢిల్లీలో అవార్డు ప్రదానం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

వ్యవసాయ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ, ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా తోటి రైతులకు అండగా నిలుస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న సిద్దిపేట జిల్లా రైతు జక్కుల కనకయ్య జాతీయ స్థాయి కర్షక రత్నం అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు, అవార్డు ఎంపిక కమిటీ సభ్యుడు కుంభాల రవీందర్ వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల గ్రామానికి చెందిన జక్కుల కనకయ్య గతంలో వివిధ రకాల కూరగాయల పంటలను సాగుచేస్తూ వ్యవసాయ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. సాగులో తన అనుభవాన్ని ఇతర రైతులతో పంచుకుంటూ, ఆధునిక



వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని తోటి రైతులకు ట్రాక్టర్ ద్వారా దుక్కి దున్నడం వంటి సహాయాలు అందిస్తూ వారి సాగు ఖర్చులు తగ్గించేందుకు తన వంతు తోడ్పాటునందిస్తున్నారని వివరించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, సామాజిక సేవ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను గుర్తించిన అవార్డు ఎంపిక కమిటీ జాతీయ స్థాయి కర్షక రత్నం అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు, జాతీయ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్ రాధాకృష్ణ జక్కుల కనకయ్యకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్లు రవీందర్ వెల్లడించారు. రైతులు, సంఘసేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి అవార్డులను అందజేస్తుందని తెలిపారు. ఈ నెల 15న దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించనున్న అకాడమీ 20వ జాతీయ మహాసభల్లో జక్కుల కనకయ్యకు కర్షక రత్నం అవార్డును ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన జక్కుల కనకయ్యను అవార్డు ఎంపిక కమిటీ సభ్యురాలు నెల్లుట్ల నర్సవ్వతో పాటు గ్రామస్థులు, తోటి రైతులు, పలువురు అభినందించారు.

సిద్దిపేట రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

చైర్మన్‌గా డాక్టర్ ఆకుల నరేష్ బాబు

వైస్ చైర్మన్‌గా డాక్టర్ బండారి విష్ణుకాంత్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

సిద్దిపేట జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన మేనేజింగ్ కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ ఆకుల నరేష్ బాబు, వైస్ చైర్మన్‌గా డాక్టర్ బండారి విష్ణుకాంత్, కోశాధికారిగా కస్తూరి భూమిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఐత బాలరాజేశం ప్రమాణం చేశారు. అదేవిధంగా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా పన్యాల మహేందర్ రెడ్డి, బుర్ర తిరుపతి, కనపర్తి సత్యనారాయణ, బత్తుల శివాజీ గణేష్, రాచకట్ల ఈశ్వర్, దేశబోయిని నరసింహులు, కానమైన ఏగొండ, వల్లకొండ రాజేశ్వర్, కంజర్ల రాజేష్, సిలివేరి కనకరాములు, దొంతుల వీరేశం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజ్‌కుమార్, ఎన్నికల అధికారి నాగేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారులు రాజశేఖర్ వర్మ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

12 మంది మహిళా కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇప్పించిన రవి

- రూ. 4లక్షల19వేలు బకాయిలు చెక్కుల రూపంలో అందజేత



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 02, :

కూకట్‌పల్లి నియోజకవర్గం హౌసింగ్ బోర్డు కాలనీలోని విశిష్ట హాస్పిటల్‌లో పనిచేసిన 12 మంది మహిళా కార్మికులకు గత ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ఇప్పించారు.హాస్పిటల్‌లో పనిచేసిన మహిళా కార్మికులకు మొత్తం రూ.4 లక్షల 19 వేల వేతనాలు చెల్లించాల్సి ఉండగా, యాజమాన్యం చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం కార్మిక నాయకుడు రవిని కలిసి మహిళా కార్మికులు తమ సమస్యను వివరించారు.వెంటనే స్పందించిన రవి విశిష్ట హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి మహిళా కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను ఇప్పించేందుకు కృషి చేశారు. దీంతో మొత్తం 12 మంది మహిళా కార్మికులకు రూ.4 లక్షల19, వేలు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మాట్లాడుతూ, తమ కష్టార్జితమైన వేతనాలను ఇప్పించేందుకు సహకరించిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సమరభేరి

- రాంలీలా మైదానంలో జరిగిన చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 02, :

ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహించిన చలో ఢిల్లీ – రాంలీలా మార్చ్‌లో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. సోమవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన సమరభేరి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ తో కలిసి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మల్లారెడ్డి నగర్‌లో హైమాస్ట్ లైట్ ప్రారంభం

- రూ.4.50 లక్షలతో లైట్ ఏర్పాటు.. ప్రజలకు మెరుగైన వెలుతురు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 02, :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా గాజులరామారం పరిధిలోని మల్లారెడ్డి నగర్‌లో రూ.4.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో ప్రధాన కూడళ్లు, రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మెరుగైన వెలుతురు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రజలకు, వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉండటంతో పాటు భద్రతకు కూడా దోహదపడుతుందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వై.పీ. గిరి, ప్రధాన కార్యదర్శి సికిందర్ రావు, సలహాదారులు దయాకర్ రెడ్డి, ఏ.వి. రావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, కరుణాకర్ రాజు, సమ్మయ్య యాదవ్, నవాబ్, ఇబ్రహీం ఖాన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం



- గాజులరామారం ఇందిరానగర్-బి కాలనీలో రూ.33 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 02, :మౌలిక వసతుల కల్పనలో భాగంగా 125వ గాజులరామారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్-బి కాలనీలో రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఇందిరానగర్-బి కాలనీలో రూ.33 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు షేక్ ఇమ్రాన్ బేగ్, షేక్ జునైద్, మూసా ఖాన్, మహమ్మద్ తాజుద్దీన్, అబ్దుల్ హనీఫ్, మహమ్మద్ అఫ్రోజ్, మహమ్మద్ ఫరూక్, గోపీ, పీఏసీఎస్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్ షా మహా పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్న మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ నాయకులు

- జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన ఓబీసీ నాయకులు, కార్యకర్తలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 02, :హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా పాల్గొన్న మహా పాదయాత్రలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ నాయకులు, ఓబీసీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు జెకె శేఖర్ యాదవ్‌తో పాటు బీజేపీ సీనియర్ నాయకుడు సిద్ధిరాం రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి గండి రాజు యాదవ్, బీజేపీ నాయకులు జగన్ ముదిరాజ్, కె. భిక్షపతి, కృష్ణ యాదవ్, కుమార్ యాదవ్ తదితరులు పాదయాత్రలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ నాయకులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.



17 ఏళ్ల నిరీక్షణకు మోక్షం

- ఆర్జీకే అభివృద్ధిపై అధికారులకు సంక్షేమ సంఘం అల్టిమేటం
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధుల డిమాండ్

కుత్బుల్లాపూర్, నవంబర్ 02, : రాజీవ్ గృహకల్ప (ఆర్‌జీకే) కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. మౌలిక వసతులు కల్పించడంతో పాటు పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చింతల్ సీఎంసీ సర్కిల్ కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన చేపట్టింది. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, మహిళా భవనం, సంక్షేమ సంఘం కార్యాలయం, పార్కుల అభివృద్ధి, విద్యుత్ సదుపాయాలు, వీధి దీపాలు, పోలింగ్ బూత్ ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో డీసీ లక్ష్మీ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మారం అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి మాట్లాడుతూ సుమారు 17 ఏళ్ల క్రితం ఏర్పాటైన రాజీవ్ గృహకల్ప కాలనీలో పదివేల మందికి పైగా నివసిస్తున్నప్పటికీ, జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లు గడుస్తున్నా కనీస మౌలిక వసతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. సంక్షేమ సంఘం నాయకులు సమర్పించిన వినతిపత్రంపై డీసీ లక్ష్మీ ప్రసన్న సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నర్సింహారెడ్డి, జగదీశ్, బాన్సువాడ వెంకటేష్, నాగభూషణం, సంక్షేమ సంఘం నాయకులు, మహిళా సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తే సహించేది లేదు

- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి
- పెండింగ్ బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలి
- కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులకు సూచన

సదాశివపేట, నవంబర్ 02, : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సోమవారం నాడు అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ధాన్యం సేకరణలో జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతు వేదికలో నందికంది పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డి మండలం నాగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులందరికీ సమాన ప్రాధాన్యం కల్పించాలని, దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించాలని సూచించారు. సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్‌ను అర్హులైన రైతులకు తప్పనిసరిగా అందించాలని పేర్కొన్నారు. గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను సైతం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, పంట రుణాలు, ఎరువుల కొరత తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ధాన్యం రవాణాలో జాప్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాముగోపాల్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, చక్రపాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సుధాకర్, లక్ష్మారెడ్డి, సర్పంచ్ అశోక్ గౌడ్, రాజు, మనీష్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- పట్టభద్రులంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 02, : ఉమ్మడి చందానగర్ డివిజన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి చందానగర్ డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులతో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేటర్ నవత రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి సమయం తక్కువగా ఉన్నందున నాయకులందరూ సమన్వయంతో పనిచేస్తూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో 3,000 నుంచి 4,000 మంది పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పట్టభద్రులందరూ బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నవత రెడ్డితో పాటు చందానగర్ డివిజన్‌కు చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



వర్షపు నీటి కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- అధికారులకు సూచించిన మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 02, : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్ సెవెన్ హిల్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద చేపడుతున్న వర్షపు నీటి కాలువ పునరుద్ధరణ పనులను మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సోమవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు నార్నె శ్రీనివాసరావు తెలిపారు. కాలనీల ప్రజల నుంచి అందిన వినతులు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని అత్యవసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను సైతం పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తానని తెలిపారు. అన్ని కాలనీలను సమస్యలులేని ఆదర్శవంతమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- సీనియర్ బీఆర్ఎస్ నాయకులు వారాల వినోద్ కుమార్‌కు కాలనీవాసుల వినతి

కుత్బుల్లాపూర్, నవంబర్ 02, : 292వ డివిజన్ సాయిబాబా నగర్ పరిధిలోని రాజుల స్వామి నగర్, దయానంద్ నగర్, మైత్రి నగర్ కాలనీలలో నెలకొన్న పలు మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా కాలనీలకు చెందిన పలువురు నివాసితులు సోమవారం సీనియర్ బీఆర్ఎస్ నాయకులు వారాల వినోద్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీవాసుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన వారాల వినోద్ కుమార్, సమస్యలన్నింటినీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైత్రి నగర్ అధ్యక్షుడు గట్టు అశోక్, రాజు యాదవ్, కావాలి రవి, ముదిరాజ్ లక్ష్మణ్, గజ్జల రమేష్‌తో పాటు పలువురు మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



మీ వెంటే ఉంటా.. బాలయ్య నగర్‌ను మరింత అభివృద్ధి చేస్తా..

- రూ.47.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- ప్రజాబంధువుకు బాలయ్య నగర్ బస్తీ వాసుల ఘన స్వాగతం

కుత్బుల్లాపూర్, నవంబర్ 02, :

బాలయ్య నగర్ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, బస్తీలో మరిన్ని మౌలిక వసతులు కల్పించి ఆదర్శ వంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్‌లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా దాదాపు రూ.47.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలయ్య నగర్ బస్తీ వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జైజై బీఆర్ఎస్.. జైజై వివేకన్న నినాదాలతో బస్తీ పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు అధికంగా నివసించే బాలయ్య నగర్ బస్తీ ఏర్పాటులో వ్యవస్థాపకులు ఎల్లయ్య చేసిన కృషి, త్యాగం మరువలేనివని పేర్కొన్నారు. గత పన్నెండేళ్లుగా బస్తీలో మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా బాలయ్య నగర్ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు బతుకమ్మ ఘాట్, ఛత్ పూజ ఘాట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని



హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేష్, ఉపాధ్యక్షుడు సిఎస్ఐ ప్రధాన కార్యదర్శి పార్వతి శ్యాంసుందర్, గంగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్, ఇబ్రహీం ఖాన్, ఇతర నాయకులు, కార్యకర్తలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

మరణించిన హోంగార్డుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన హోంగార్డుల కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం మంజూరు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తూ మరణించిన హోంగార్డులు సుబ్బరాజు, శంకరయ్య కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. ఈ సందర్భంగా ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ తీసుకున్న పోలీస్ శాఖకు హోంగార్డుల కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉండగా లేదా ఇతర కారణాలతో మరణించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, హోంగార్డుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీస్ కుటుంబాల్లో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరి కుటుంబ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, మరణించిన హోంగార్డుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.

సుద్దాల జానకమ్మ హనుమంతు చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజా శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి
- గూడ ఐలయ్య గౌడ్‌కు ఘన సన్మానం
- కార్మికుల కోసం ఆయన చేసిన పోరాటాలు అభినందనీయం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 02, :

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజాకవి సుద్దాల హనుమంతు చరిత్రను భావితరాలకు తెలియజేసేలా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజా శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రజాకవి సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ అవార్డు-2026 అందుకున్న వామపక్ష ఉద్యమ నేత, కార్మిక నాయకుడు గూడ ఐలయ్య గౌడ్‌ను సోమవారం సూరారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఐఎన్‌టీయూసీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు, హెచ్ఎంటీ కార్మిక సంఘం నాయకుడు కృష్ణగౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంజా శ్రీనివాస్



మాట్లాడుతూ సమసమాజ స్థాపన లక్ష్యంగా గత 40 సంవత్సరాలుగా కార్మికులు, పేదల పక్షాన నిరంతరం పోరాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ సేవలను గుర్తించి అవార్డుతో గౌరవించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుద్దాల ఫౌండేషన్ చైర్మన్, సినీ గేయ రచయిత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజకు కార్మికుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ జైలు జీవితాన్ని సైతం అనుభవించిన గూడ ఐలయ్య గౌడ్‌కు ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. సుద్దాల హనుమంతు స్ఫూర్తితో కార్మిక వర్గానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. నాటి తెలంగాణలో నైజాం పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని, గళాన్ని ఆయుధాలుగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజాకవి సుద్దాల హనుమంతు పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగాలన్న నాటి ప్రజాకవుల ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం, కళలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కవులు, కళాకారులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ బుధాల అమర్ బాబు, మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, గ్రేటర్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు చాంద్ పాషా, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బాబురావు, రాష్ట్ర మీ సేవ అధ్యక్షుడు జాన్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వివిధ కంపెనీల ఐఎన్‌టీయూసీ మహిళా నాయకులు అచ్చమ్మ, సీతమ్మ, రమ్యవాణి, సువర్ణ, వరలక్ష్మి తదితరులు పాల్గొని గూడ ఐలయ్య గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 02, :

ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఆర్ఓ కె. వై. ప్రసాద్, ఆర్డీఓలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహా రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రక్ పార్కు భూమి ప్రజలకే చెందాలి

- వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, ప్లే గ్రౌండ్‌లు ఏర్పాటు చేయాలి

కూకట్‌పల్లి ప్రతినిధి | నవంబర్ 02, :

కూకట్‌పల్లి పరిధిలోని సర్వే నంబర్లు 121 నుంచి 157 వరకు ఉన్న 33 ఎకరాల భూమిలో, మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ట్రక్ పార్కు స్థలాన్ని వేలం వేయకుండా ప్రజా అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో ప్రభుత్వ భూముల వేలం నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా జూపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కాపాడుతూ వచ్చామని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గ్రామ అభివృద్ధి కోసం గతంలో స్థానికులు తమ పట్టా భూములను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందజేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ట్రక్ పార్కు స్థలాన్ని వేలం వేయడం వల్ల పరిసర ప్రాంతాల్లోని 60 బస్తీల ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భూమిని ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, ప్లే గ్రౌండ్‌ల ఏర్పాటుకు వినియోగించాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర



ప్రభుత్వం వేలం నిర్ణయంపై పునరాలోచించి, ప్రజా ప్రయోజనాల కోసం ట్రక్ పార్కు స్థలాన్ని కేటాయించాలని జూపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వాసవి క్లబ్ చేయూత!

- గాజులరామారం ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ.. విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 02, :

విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనే సంకల్పంతో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గాజులరామారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, శ్రీ చిత్తారమ్మ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గాజులరామారంలోని ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా



నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే అమూల్యమైన సంపదని, విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవరశెట్టి జగదీశ్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు సిద్ధా సూర్య ప్రకాష్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి గాంధీ, జనరల్ సెక్రటరీ బొల్లా శ్రీనివాస్, కోశాధికారి శివప్రసాద్, వాసవి క్లబ్ ప్రతినిధులు వాస శ్రీనివాసులు, సోమిశెట్టి పవన్, ఆకుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.



ఆదివాసీల హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం

- ఆదివాసి సేన కమిటీ భద్రాద్రి జిల్లా సలహాదారుడు చిలకా శ్రీను నియమకం

దమ్మపేట, నవంబర్ 02, :

ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని ఆదివాసి సేన రాష్ట్ర సలహాదారు, కార్యదర్శి, హైకోర్టు అడ్వకేట్ ఊకె రవి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలంలో ఆయన ఆధ్వర్యంలో ఆదివాసి సేన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి సేన మండల పాలక మండలి కమిటీలో మార్పులు, చేర్పులు, సంస్థాగత బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. మండల కమిటీలో ప్రస్తుతం ఉన్న 30 మంది సభ్యుల భాగస్వామ్యంతో సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు ఏమనగా రెండు రాష్ట్రాల తరపున తొలిసారిగా సుప్రీంకోర్టులో ఇంప్లీడింగ్ పిటిషన్ దాఖలు చేసిన అంశంపై చర్చించి, దాని ప్రాధాన్యతపై సభ్యులకు అవగాహన కల్పించారు. 2014 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఆదివాసి సేన మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, నిర్వహించిన ఉద్యమాలు, సాధించిన విజయాలు, సమర్పించిన వినతులు, చేసిన తీర్మానాలపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా మండల కమిటీలో స్వల్ప మార్పులు, చేర్పులతో పాటు ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమాలు,



కార్యాచరణపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆదివాసీల హక్కుల సాధన, చట్టాల పరిరక్షణ, ఐక్యతను పెంపొందించడం, సంస్థాగతంగా ఆదివాసి సేనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సమావేశం కొనసాగింది.

కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ మహా పాదయాత్ర

- ఎస్ఐఆర్‌పై ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే లక్ష్యం
- నిజాంపేట్ సర్కిల్ నుంచి భారీగా మహా పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 02, :

కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్‌పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి అమిత్ షా పిలుపు మేరకు నిర్వహించిన మహా పాదయాత్రలో భాగంగా సోమవారం మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి తో కలిసి నిజాంపేట్ సర్కిల్ నుంచి భారీ ఎత్తున మహా పాదయాత్రలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా ప్రజలకు ఎస్ఐఆర్‌పై వాస్తవాలను వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కృషి చేయడం జరిగింది.

ఆయుష్ మల్టీ పర్పస్ వర్కర్ల పోస్టులకు నవంబర్ 6న రాత పరిక్ష

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 02, :

ఆయుష్ విభాగంలో మల్టీ పర్పస్ వర్కర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నవంబర్ 6న రాత పరిక్షి నిర్వహించనున్నట్లు జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నవంబర్ 6న 11 గం.లకు జగిత్యాల కలెక్టరేట్ సముదాయంలో గల మీటింగ్ హాల్ (సమావేశ మందిరం రూం నెం. 38) లో రాత పరిక్ష ఉంటుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి 15 ని. ముందుగా హాజరు కావాలని సూచించారు.

టిఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మడిపల్లి వినీత్ పటేల్

టిఆర్ఎస్ చీఫ్ కవితకు కృతజ్ఞతలు తెలిపిన వినీత్



కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన మడిపల్లి వినీత్ పటేల్ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్కకి హృదయ పూర్వక ధన్యవాదాలు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నా మీద నమ్మకంతో కీలకమైన యువజన విభాగానికి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతను అప్పగించిన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కవితమ్మకి ధన్యవాదాలు తెలుపుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆశయాలకు సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, కరీంనగర్ జిల్లాలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, రానున్న రోజులలో యువకులు పెద్దెత్తున టిఆర్ఎస్ పార్టీలో చేరే విధంగా మా కార్యచరణ ఉంటుందని, అదేవిధంగా నిరుద్యోగులకు యువకులకు ఉన్న సమస్యల మీద ప్రభుత్వంపైన ఒత్తిడి తెచ్చే విధంగా యువకులను కలుపుకుని యువకుల హక్కుల పరిరక్షణకు, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మడిపల్లి వినీత్ పటేల్ అన్నారు. ఈ సందర్భంగా నా నియామకానికి సహకరించిన టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన ఓటర్ల పేరు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- 'సర్' ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు
- నవంబర్ 26లోగా విచారణలు, అభ్యంతరాల పరిష్కారం
- 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో సర్ ప్రక్రియ పురోగతి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. సిద్దిపేట జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఏఎస్‌డీ (గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించినవారు) జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని తెలిపారు. సరైన విచారణ లేకుండా అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా తొలగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల తొలగింపు జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, పేరు తొలగించడానికి గల కారణాలు, అందుకు సంబంధించిన ఆధారాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల సమర్పించే అభ్యంతరాలు, వివరణలు, ఆధార పత్రాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కొత్త ఓటరు నమోదుకు సంబంధించి ఫారం-6, అభ్యంతరాలు, పేర్ల తొలగింపునకు సంబంధించి ఫారం-7, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణకు సంబంధించి ఫారం-8 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి అధికారులు తీసుకునే ప్రతి నిర్ణయానికి స్పష్టమైన కారణాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రతి కేసుకు సంబంధించిన నోటీసులు, వాటి అందజేత వివరాలు, విచారణ నివేదికలు, ఓటర్లు సమర్పించిన ఆధార పత్రాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని సూచించారు. భవిష్యత్తులో అభ్యంతరాలు వచ్చినా సంబంధిత రికార్డులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు తమ వాదనలు వినిపించేందుకు తగిన అవకాశం కల్పించాలని, క్షేత్రస్థాయి విచారణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఏఎస్‌డీ, తొలగింపు జాబితాలు, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని నిరంతరం సమీక్షించాలని సూచించారు. తుది జాబితా ప్రచురణకు ముందు అన్ని వివరాలను మరోసారి పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26, 2026లోగా నోటీసుల జారీ, విచారణలు, అభ్యంతరాలు, వాటి పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున నిర్ణీత గడువులను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.

రైస్ ట్రేడర్స్ దుకాణాల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

- తూనికల్లో తేడాలు గుర్తింపు.. రెండు దుకాణాలపై కేసు నమోదు..
- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సన్న బియ్యం విక్రయించాలి.. అధికారులు..





సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 02, :

సిద్దిపేట పట్టణంలో బియ్యం వ్యాపార దుకాణాలపై జిల్లా పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతల శాఖ, జీఎస్టీ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్షి కిరణ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి శివరంజని, జిల్లా జీఎస్టీ అధికారి వేణుగోపాలరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు (పౌరసరఫరాలు) రాజిరెడ్డి, ఆసిఫ్ తదితరులు పట్టణంలోని పలు రైస్ ట్రేడర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిద్ధి వినాయక, విజయదుర్గ ట్రేడర్స్ బియ్యం దుకాణాల్లో తూకాల్లో వ్యత్యాసాలను అధికారులు గుర్తించారు. దీంతో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులు సంబంధిత దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం సన్న బియ్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని వ్యాపారులకు సూచించారు. తూకాల్లో ఎలాంటి మోసాలకు పాల్పడినా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా బియ్యం విక్రయించినా సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగ దారులకు న్యాయం జరిగేలా వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి

- ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం



శేరిలింగంపల్లి ప్రతినిధి, నవంబర్ 02, :

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై సోమవారం చందానగర్, మక్తా-మియాపూర్ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మన ఇళ్లలో ఉన్న పట్టభద్రులతో పాటు కాలనీలు, డివిజన్ల పరిధిలోని పరిచయస్తులు, బంధువుల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని తెలిపారు. గతంలో పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్న వారు సైతం తిరిగి నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని, గత ఎన్నికల ఓటరు జాబితాలను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సేకరించాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ చివరి గడువు కావడంతో నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఎదురుచూస్తున్నారని వారు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను, యువతకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి భారీ మెజారిటీతో విజయం సాధించేలా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, చందానగర్, మక్తా-మియాపూర్ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీజీఐపాస్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 02, :

జగిత్యాల జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి టీజీఐపాస్ ద్వారా అందిన దరఖాస్తులు, మంజూరు చేసిన అనుమతులు, పెండింగ్‌లో ఉన్న అంశాలపై జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశం నుంచి ఇప్పటి వరకు పరిశ్రమల స్థాపన అనుమతుల కోసం టీజీఐపాస్ ద్వారా అందిన దరఖాస్తులను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత అధికారులు ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని, నిర్దేశిత గడువులోగా అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అదేవిధంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న టీ-ప్రైడ్ పథకం కింద షెడ్యూల్డ్ కులాలకు చెందిన నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.37.33 లక్షల పెట్టుబడి రాయితీని మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి. మధులత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ శ్రీ అనిల్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ రామ్ కుమార్, ప్రాంతీయ రవాణా అధికారి సమ్దాని మహమ్మద్, జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారి శ్రీమతి సుజాత, ఎన్పీడీసీఎల్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



నడకతో ఆరోగ్యం.. నడకతో ఆయుష్షు..

వాకింగ్ అత్యుత్తమైన ఆరోగ్య అలవాటు. పైసా ఖర్చు లేకుండా మన శరీరాన్ని బాగు చేసుకొనే ప్రక్రియ. క్రమం తప్పకుండా నడిస్తే రోగాలు దరి చేరవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాకింగ్ వల్ల లాభాలేంటి? అసలు వాకింగ్ ఏ సమయంలో చేయాలి? ఎలా చేయాలి? అన్న విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం. నడక వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఎక్కువ.

డిప్రెషన్ దూరమవుతుంది..!

నడక వల్ల డిప్రెషన్ దూరమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నడక వల్ల గుండె సంబంధిత వ్యాధులు కూడా తగ్గే ముప్పు తగ్గుందంటున్నారు. వేగంగా నడవడం వల్ల గుండెకు, శ్వాస వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది. ఆంగ్జయిటీ లేదా డిప్రెషన్‌తో బాధపడేవారికి నడక మరింత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. నడవడం వల్ల శరీరంలోని ఎముకలు పటిష్టంగా మారతాయి. ఎముకలు పెళుసుగా మారడాన్ని నడకతో నివారించవచ్చు. రోజూ నడిస్తే శరీరంలోని కండరాలు బలంగా మారతాయి. నడక శరీరాన్ని సమతుల్యంగా ఉంచుతుంది. శరీరానికి సరైన ఆకృతిని అందిస్తుంది. కండరాలను ఆరోగ్యంగా మార్చుతుంది. బరువు తగ్గించుకోవడానికి నడక ఒక మంచి మార్గం. నడక వల్ల శక్తి ఖర్చు అవుతుంది. ఫలితంగా బరువు తగ్గవచ్చు. నడక వల్ల శరీరంలో చక్కెర స్థాయిలో అదుపులో ఉంటాయని అనేక అధ్యయనాల్లో తేలింది. నడక వల్ల కొవ్వు పేరుకోదు. గుండె జబ్బులు, డయాబెటిస్, కాలేయ వ్యాధులకు కొవ్వు పేరుకుపోవడమే కారణం. ఇన్సులిన్‌కు శరీరం స్పందించే తీరును కూడా నడక మెరుగుపరుస్తుంది.

ఆయుష్షు ను పెంచుతుంది

నడక, ఆయుష్షును పెంచుతుంది. నడక వల్ల 1620 సంవత్సరాలు అదనంగా జీవించవచ్చు. ఎంత ఎక్కువగా నడిస్తే, మరణాన్ని అంత దూరంగా తరిమేయవచ్చు. నడక కేవలం శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. డిప్రెషన్ విషయంలో నడక అనేది ఒక యాంటీ డిప్రెసెంట్‌గా పని చేస్తుంది. రోజూ వాకింగ్ చేయడం వల్ల క్రమశిక్షణ అలవడుతుంది. మానసిక స్థితి కూడా బాగుంటుంది. బహిరంగ ప్రదేశాల్లో నడవడం వల్ల శరీరంలో విటమిన్ 'డి' స్థాయిలు పెరుగుతాయి. శరీరానికి సూర్యరశ్మి తగలడం వల్ల శరీరంలో విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది.

ఎలా నడవాలి?

తొలుత నెమ్మదిగా నడకను మొదలుపెట్టి క్రమక్రమంగా వేగాన్ని పెంచాలి. గంటకు 6.4 కి.మీ వేగంతో రోజూ 30 నిమిషాల పాటు నడవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఏదైనా వాకింగ్ గ్రూపులో చేరితే రోజూ నడవాలనే ఉత్సాహం కూడా వస్తుంది. ఒక్కసారి మీరు నడవాలని నిర్ణయించుకున్న తర్వాత అది మీ జీవితంలో భాగంగా మారుతుంది. ఇటీవలి కొన్ని పరిశోధనల ప్రకారం, మహిళలైతే ఉదయం 8 గంటల నుంచి 11 గంటల మధ్య నడిస్తే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అన్నింటికంటే రోజంతా చురుగ్గా ఉండటానికి నడక మంచి మార్గం. నడక ఉత్సాహంగా ఉంచుతుంది

ఏ వయసు వారు ప్రారంభించాలి..!

వాకింగ్ ను ఎవరైనా..ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చు. 45 ఏళ్ల లోపు వారికి ఎలాంటి పరీక్షలు అవసరం లేదు. 45 ఏళ్లు దాటినవారు..నడిస్తే ఆయాసం, గుండెనొప్పి, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు ముందుగా డాక్టర్‌ను కన్సల్ట్ అయ్యి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయసు నుంచే డయాబెటిక్ టైప్ 1 ఉన్న వారు డాక్టర్ సూచన మేరకే వాకింగ్, వర్కవుట్స్ చేయాలి. ఎందుకంటే వీళ్లు ఇన్సులిన్ తీసుకుంటుంటారు కాబట్టి రక్తంలో గ్లూకోజు బాగా పడిపోయే అవకాశముంది.డయాబెటిక్ టైప్ 2 ఉన్న వారు అందిరిలాగే వాకింగ్ చేయొచ్చు. ముందుజాగ్రత్తగా గ్లూకోజు బిస్కట్లు పెట్టుకోవటం మంచిది. గ్లూకోజు పడిపోయినట్లనిపిస్తే వెంటనే తినటానికి ఉపయోగపడతాయి.

ఈ పరిస్థితుల్లో నడవొద్దు..!

పుల్లుగా తిని వాకింగ్ చేయడం మంచిది కాదు. రెండు మూడ్రోజులు బ్రేక్ ఇచ్చి నడవడం కంటే డైలీ వాకింగ్ చేస్తేనే ప్రయోజనం. వాకింగ్ ఆపేసిన మళ్లీ ప్రారంభించాలంటే నెమ్మదిగా స్టార్ట్ చేయాలి. డైలీ అరంగట వాకింగ్ కు టైమ్ కేటాయించాలిత క్కువ దూరంతో వాకింగ్ స్టార్ట్ చేసి రోజురోజుకు పెంచుకుంటూ వెళ్లాలి.



చన్నీటి స్నానం మంచిదేనా?

చన్నీటితో స్నానం చేయాలా? వేడి నీటితో స్నానం చేయాలా? గోరువెచ్చటి నీటితో స్నానం చేస్తే బెటరా? చాలా మందిని ఈ సమస్యలు వేదిస్తుంటాయి. చలికాలం ఎలాగూ తప్పదు కాబట్టి చాలా మంది హాట్ వాటర్ తోనే స్నానం చేస్తారు. అయితే కొంతమంది కాలాలకు అతీతంగా ప్రతి సీజన్ లోనూ వేడినీటితోనే స్నాం చేస్తారు. అసలు నీటితో స్నానం మంచిది.. నిపుణులు ఏం చెప్తున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

చల్లటి నీటితో స్నానం చేయడమే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతుంటారు. చర్మ సంబంధిత సమస్యలు మొదలు ఎన్నో ఇతర సమస్యలకు చెక్ పెట్టొచ్చని అంటుంటారు. ఇక చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కూడా చాలా మంది భావిస్తుంటారు. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం వెంటనే రిఫ్రెష్ అవుతుంది. శరీరానికి ఇన్‌స్టంట్ ఎనర్జీ వస్తుంది. చల్లటి నీటితో స్నానం చేసిన వెంటనే ఉల్లాసంగా ఉంటారు. అలాగే చల్లని నీరు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది మీ చర్మాన్ని మెరిసేలా, ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగవుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఎంత టెన్షన్, ఒత్తిడి ఉన్నా బలదూర్ అవుతుందని చెబుతున్నారు. అయితే రోగ నిరోధక శక్తి బలపడుతుందా అంటే మాత్రం..కచ్చితంగా అవుననే సమాధానం చెప్పలేమని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తిని బలోపేతం కావాలంటే చల్లటి నీటితో స్నానం చేస్తే సరిపోదని. తీసుకునే ఆహారంలో కూడా ఎన్నో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. ముఖ్యంగా విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.



జపనీస్ మచా ఫ్లేవర్ టీతో

ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు

మనదేశంలో టీ ఫ్యాన్స్ కు కొదవ లేదు. చాలా మందికి పొద్దునే ఓ కప్పు టీతాగితే డే స్టార్ట్ కాదు. ఇక ప్రస్తుతం మార్కెట్ లో రకరకాల టీ ఫ్లేవర్లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే లేటెస్ట్ గా జపనీస్ మచా ఫ్లేవర్ టీ ట్రెండ్ అవుతోంది. అసలు ఈ టీ ప్రయోజనం ఏమిటి? దీంతో లాభాలు ఏంటి? ఈ టీని ఎలా తయారుచేస్తారు? ఈ కథనంలో తెలుసుకుందాం..!

మాచా ఫ్లేవర్ టీ ..

భారత్ లో టీ ఎంత ప్రాచుర్యం పొందిందో జపాన్ లో మచా ఫ్లేవర్ టీ కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంది. రుచి మాత్రమే కాదు ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో పోషకాలు ఇందులో ఉన్నాయి. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ గ్రీన్ టీ 'మచ్చా', దీనిని జపనీస్ మచా అని కూడా పిలుస్తారు. ఈ టీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందుతోంది. 'మచా' గ్రీన్ టీ ఆకులను గ్రైండ్ చేసి పొడి తయారు చేస్తారు. ఈ టీలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఎనర్జీ, డిటాక్సిఫికేషన్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ టీ తో కలిగే లాభాల కోసం ఇంకా అనేక ప్రయోగాలు కొనసాగుతున్నాయి.



చుండ్రుకు చెక్ పెట్టండిలా..!

చుండ్రు ఈ సమస్య అందరినీ వేదిస్తోంది. అసలు చుండ్రును ఎలా పోగొట్టుకోవాలా.. ప్రస్తుత జీవనశైలి, ఆరోగ్య సమస్యలతో చాలా మందికి చుండ్రు సమస్యగా మారింది. ఇక నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, కెమికల్స్‌తో కూడిన షాంపూలు వాడడం కూడా ఓ కారణమని చెబుతున్నారు. చుండ్రును తగ్గించుకోవడానికి మార్కెట్లో లభించే రకరకాల షాంపూలను, నూనెలను ఉపయోగిస్తుంటారు. అయితే ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఉపశమనం లభించకపోతే బిర్యానీ ఆకులతో నేచురల్ చిట్కా పాటిస్తే.. చుండ్రు ఇట్టే పరార్ అవుతుంది. బిర్యానీ ఆకులోని ఔషధ గుణాలు చుండ్రును తరిమేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బిర్యానీ ఆకుల ద్వారా కేవలం చుండ్రు మాత్రమే కాకుండా.. తలపై ఉండే వాపు, దురద, దద్దుర్లు, పొడి బారడం వంటి సమస్యలను దూరం అవుతాయి. ఇంతకీ బిర్యానీ ఆకులతో హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఇలా చేయండి..!

బిర్యానీ ఆకులను తీసుకొని, కొన్ని నీళ్లు పోసుకొని బాగా మరిగించాలి. ఆకులు పూర్తిగా మరిగిన తర్వాత, చల్లార్చి బిర్యానీ ఆకులను మిక్సీ పట్టుకోవాలి. అలాగే అందులో.. కాస్త వేప ఆయిల్ లేదా అలోవెరా జెల్, ఉసిరి పొడి లాంటివి యాడ్ చేసి మిక్స్ చేయాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించాలి. ఇలా ఓ ఐదు నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత పావుగంట పాటు ఆరబెట్టాలి. ఆ తర్వాత షాంపూతో తలను శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే మార్పు ఇట్టే కనిపిస్తుంది.



దిగ్గజ జట్లకు షాక్..

వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్
- తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు
- శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లను వెనక్కి నెట్టిన వైనం
- వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అద్భుత ప్రదర్శనలతో సత్తా చాటిన ఆఫ్ఘన్
- ఇటీవల ఐర్లాండ్, జింబాబ్వే సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌లతో జోరు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

న్యూజిలాండ్ వీధుల్లో సామాన్యుల్లా భారత క్రికెటర్లు.. వీడియో వైరల్!

- న్యూజిలాండ్ వీధుల్లో షికారు చేసిన రోహిత్ శర్మ, కుల్దీప్ యాదవ్
- ఆక్లాండ్‌లో వారిని ఎవరూ గుర్తుపట్టకపోవడం విశేషం
- విదేశాల్లో క్రికెటర్లకు దొరికే స్వేచ్ఛపై సోషల్ మీడియాలో చర్చ
- ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్



భారత క్రికెట్ స్టార్లకు స్వదేశంలో ఉండే ఆదరణ, అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వారు బయటకు వస్తే చాలు, అభిమానులు చుట్టుముడతారు. అయితే, విదేశీ పర్యటనల్లో మాత్రం వారికి పూర్తి భిన్నమైన అనుభవం ఎదురవుతుంది. తాజాగా టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, కుల్దీప్ యాదవ్ విషయంలో ఇదే జరిగింది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ, కుల్దీప్ ఆక్లాండ్ వీధుల్లో సరదాగా షికారు చేస్తూ కనిపించారు. సాధారణ దుస్తుల్లో సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మాట్లాడుకుంటూ నడుస్తున్న వీరిని స్థానికులు ఎవరూ గుర్తుపట్టినట్లు కనిపించలేదు. ఎలాంటి హడావుడి లేకుండా, పూర్తి స్వేచ్ఛగా వారు తమ సమయాన్ని ఆస్వాదించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన అభిమానులు.. విదేశాల్లో భారత క్రికెటర్లకు లభించే ప్రశాంతత, వ్యక్తిగత స్వేచ్ఛపై చర్చించుకుంటున్నారు. కాగా, ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం రోహిత్ శర్మ గత వారమే న్యూజిలాండ్ చేరుకున్నాడు. ఇక కుల్దీప్ యాదవ్ ఇప్పటికే అక్కడ ముగిసిన టీ20 సిరీస్‌లో జట్టులో ఉన్నప్పటికీ, ఆడే అవకాశం రాలేదు. కనీసం వన్డే సిరీస్‌లోనైనా తుది జట్టులో చోటు దక్కించుకోవాలని ఆశిస్తున్నాడు.

భారత్‌తో సిరీస్‌కు ముందే కివీస్‌కు షాక్..

ఇద్దరు కీలక ఆటగాళ్లు ఔట్!

- భారత్‌తో వన్డే సిరీస్‌కు చాప్‌మన్, రచిన్ రవీంద్ర దూరం
- చాప్‌మన్‌కు ఎడమ తొడ కండరాల గాయం
- రచిన్ రవీంద్ర భుజం గాయం నుంచి కోలుకోలేదు
- తొలి మూడు వన్డేలకు హెన్రీ నికోల్స్ ఎంపిక
- చివరి రెండు వన్డేలకు డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ జట్టులోకి



భారత్‌తో వన్డే సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కీలక ఆల్‌రౌండర్లు మార్క్ చాప్‌మన్, రచిన్ రవీంద్ర గాయాల కారణంగా సిరీస్ మొత్తానికి దూరమయ్యారు. ఇప్పటికే గాయాలతో ఇబ్బందులు పడుతున్న ఈ ఇద్దరూ కోలుకోవడానికి మరింత సమయం అవసరమని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఐదు వన్డేల సిరీస్‌కు ముందు ఈ పరిణామం కివీస్ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. మార్క్ చాప్‌మన్ ఎడమ తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎంఆర్ఐ పరీక్షల్లో గాయం పూర్తిగా తగ్గలేదని తేలింది. మరో రెండు వారాల పాటు విశ్రాంతి, పునరావాస చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. మరో ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర భుజం గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. వైట్‌బాల్ క్రికెట్‌లో ఫీల్డింగ్ చేసే స్థాయికి అతడి భుజం మెరుగుపడలేదని కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. ఈ నెలలో భారత్‌తో టెస్టు సిరీస్ కూడా ఉండటంతో అతడి విషయంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. చాప్‌మన్, రచిన్ స్థానాల్లో న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. తొలి మూడు వన్డేలకు హెన్రీ నికోల్స్ జట్టులోకి వచ్చాడు. నాలుగు, ఐదు వన్డేలకు డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ అందుబాటులో ఉండనున్నాడు. తొలుత చివరి రెండు మ్యాచ్‌లకే ఎంపికైన టిమ్ సీఫెర్ట్ ఇప్పుడు ఐదు మ్యాచ్‌లకూ జట్టులో కొనసాగనున్నాడు. మరోవైపు మాట్ హెన్రీ సోమవారం జట్టుతో కలిశాడు. అతడి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరిశీలించిన తర్వాత ఆడించడంపై నిర్ణయం తీసుకోనున్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే బుధవారం ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరగనుంది. ఐదు వన్డేల సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ ఆటగాళ్లు సోమవారం ఆక్లాండ్‌లో సమావేశం కానున్నారు.



రైజింగ్ స్టార్స్ ఆసియా కప్

భారత-ఏ కెప్టెన్‌గా తిలక్ వర్మ.. జట్టులో హేమాహేమీలకు చోటు!

ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నిర్వహించనున్న పురుషుల రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం భారత-ఏ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మకు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించగా, ఐపీఎల్‌లో రెండుసార్లు టైటిల్ గెలిచిన జట్టులో కీలక పాత్ర పోషించిన రజత్ పటిదార్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టోర్నమెంట్ నవంబర్ 19 నుంచి 29 వరకు ఖతార్‌లోని దోహా వేదికగా జరగనుంది. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో కీలక ఆటగాళ్లకు చోటు దక్కింది. వికెట్ కీపర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, కుమార్ కుశాగ్ర ఎంపికయ్యారు. వారితో పాటు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్, ప్రిన్స్ యాదవ్, సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, హర్ష్ దూబే వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. గాయం కారణంగా కొంతకాలంగా ఆటకు దూరమైన సీమ్ బౌలింగ్ ఆల్-రౌండర్ హర్షిత్ రాణా పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి పునరాగమనం చేశాడు. తనుష్ కోటియన్, విప్రాజ్ నిగమ్, అర్షద్ ఖాన్‌లతో జట్టు కూర్పు సమతూకంగా కనిపిస్తోంది. గత ఏడాది దోహాలో జరిగిన టోర్నీలో పాల్గొన్న భారత-ఏ జట్టుతో పోలిస్తే ఈసారి సెలక్టర్లు భారీ మార్పులు చేశారు. గత జట్టు నుంచి కేవలం వైభవ్ సూర్యవంశీ, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే మాత్రమే తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. గత కెప్టెన్ జితేష్ శర్మ, వైస్ కెప్టెన్ నమన్ ధీర్‌లతో పాటు పలువురు ఆటగాళ్లను వివిధ కారణాలతో ఎంపిక చేయలేదు. ఈ టోర్నమెంట్‌లో భారత-ఏ జట్టు గ్రూప్-బిలో ఉంది. ఇదే గ్రూప్‌లో యూఏఈ, నేపాల్, పాకిస్థాన్-ఏ జట్లు ఉన్నాయి. గ్రూప్-ఏలో బంగ్లాదేశ్-ఏ, శ్రీలంక-ఏ, ఆఫ్ఘనిస్థాన్-ఏ, హాంకాంగ్ ఉన్నాయి. భారత్ తన తొలి మ్యాచ్‌ను నవంబర్ 20న నేపాల్‌తో ఆడనుంది. అనంతరం నవంబర్ 22న పాకిస్థాన్-ఏ జట్టుతో, నవంబర్ 24న యూఏఈతో తలపడనుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 26, 27 తేదీల్లో సెమీఫైనల్స్, నవంబర్ 29న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

భారత-ఏ జట్టు:

తిలక్ వర్మ (కెప్టెన్), రజత్ పటిదార్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబే, తనుష్ కోటియన్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్ ఖాన్.



2008 నాటి పరిస్థితులు వేరు..

ఇప్పుడు ఐపీఎల్ క్యాలెండర్ మార్చాలి

లలిత్ మోదీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వ్యవస్థాపకుడు లలిత్ మోదీ, టోర్నమెంట్ నిర్వహణలో భారీ మార్పులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం మార్చి-మే నెలల మధ్య జరుగుతున్న ఐపీఎల్‌ను అక్టోబర్-ఏప్రిల్ మధ్య కాలానికి మార్చాలని, జనవరిలోనే ప్రారంభించి మ్యాచ్‌ల సంఖ్యను 94కి పెంచాలని సంచలన ప్రతిపాదన చేశారు. ఈ మార్పులకు వీలుగా అంతర్జాతీయ క్యాలెండర్‌ను సర్దుబాటు చేసేందుకు ఐసీసీ చైర్మన్ జై షా చొరవ చూపాలని ఆయన కోరారు. క్రిక్‌బజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లలిత్ మోదీ తన ప్రణాళికలను వివరించారు. "2008లో ఐపీఎల్ ప్రారంభించినప్పుడు ఏప్రిల్-మే నెలలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి, ఇప్పుడు పరిస్థితులు మారాయి. అప్పట్లో ఎనిమిది జట్లతో 59 మ్యాచ్‌లు ఉండేవి, కానీ ఇప్పుడు బీసీసీఐ జట్ల సంఖ్యను 10కి పెంచింది. 10 జట్లతో పూర్తిస్థాయి హోమ్ అండ్ అవే పద్ధతిలో టోర్నీ నిర్వహించాలంటే 94 మ్యాచ్‌లు అవసరమవుతాయి. ఇది పాత ఫార్మాట్‌తో పోలిస్తే దాదాపు 60% అధికం" అని ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్ చివరి దశలో వేడి, తేమ కారణంగా ఆటగాళ్లు, ప్రేక్షకులు ఇబ్బంది పడుతున్నారని మోదీ అన్నారు. మ్యాచ్‌ల సంఖ్య పెరిగినప్పుడు, అదే తక్కువ సమయంలో టోర్నీని ముగించడం వల్ల ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి పడుతుందని, దీన్ని అధిగమించాలంటే సుదీర్ఘ సీజన్ అవసరమని వాదించారు. "ఫుట్‌బాల్ లీగ్స్ మాదిరిగా వారాంతపు మ్యాచ్‌లు, సరైన సమయాలు, సౌకర్యవంతమైన స్టేడియం వాతావరణం కల్పించడం ద్వారా అభిమానులకు మెరుగైన అనుభూతిని అందించవచ్చు" అని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా టోర్నీని రెండు విండోలుగా విభజించే ఆలోచనను ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ మార్పుల కోసం అంతర్జాతీయ, దేశీయ క్రికెట్ షెడ్యూళ్లలో మార్పులు అవసరమని మోదీ అంగీకరించారు. "భవిష్యత్తులో ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ టోర్నీల ద్వారా వచ్చే ఆదాయం తగ్గే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బీసీసీఐకి ఐపీఎల్ ఒక జీవనాడిగా మారుతుంది. అందుకే ముందుచూపుతో ప్రణాళికలు వేయాలి" అని ఆర్థిక కోణాన్ని విశ్లేషించారు. ఈ విషయంలో ఐసీసీ చైర్మన్‌గా జై షా తన పలుకుబడిని ఉపయోగించి నాయకత్వం వహించాలని లలిత్ మోదీ కోరారు. "ఐపీఎల్‌ను బలోపేతం చేస్తూనే, ఇతర దేశాల బోర్డుల ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఒక ఒప్పందాన్ని కుదర్చగలరని ఆశిస్తున్నాను. ఇది జై షా ఛైర్మన్‌షిప్‌లో ఒక చారిత్రాత్మక విజయంగా నిలుస్తుంది. 2008 నాటి పరిస్థితులకు అనుగుణంగా ఐపీఎల్‌ను నిర్మించాం. ఇప్పుడున్న పరిస్థితులకు తగ్గట్టుగా దాన్ని పునర్‌నిర్మించాల్సిన సమయం వచ్చింది" అని ఆయన తన వాదనను ముగించారు.



రూ.800 కోట్ల క్లబ్‌లోకి 'జైలర్ 2'..

కోలీవుడ్‌లో రజనీకాంత్ సరికొత్త రికార్డ్!

- ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లు దాటిన 'జైలర్ 2' వసూళ్లు
- ఈ ఘనత సాధించిన తొలి తమిళ చిత్రంగా సరికొత్త రికార్డ్
- 18 రోజుల్లోనే ఈ అరుదైన మైలురాయిని అందుకున్న సినిమా
- రజనీకాంత్ పాత రికార్డులను సైతం అధిగమించిన వసూళ్లు
- భారత్‌లో రూ. 456 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 18 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్ల వసూళ్ల మార్క్‌ను దాటిన తొలి తమిళ చిత్రంగా ఈ సినిమా రికార్డు నెలకొల్పింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో అక్టోబర్ 15న విడుదలైన ఈ యాక్షన్ కామెడీ సీక్వెల్, వసూళ్లలో తన జోరును కొనసాగిస్తోంది. ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'సాక్‌నిల్క్' వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 18వ రోజు నాటికి ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 808 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో దేశీయంగా రూ. 456 కోట్ల నెట్ (సుమారు రూ. 534 కోట్ల గ్రాస్) రాబట్టగా, విదేశాల్లో రూ. 273-274 కోట్ల వరకు వసూళ్లు సాధించింది. 18వ రోజైన ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 11.2 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం. ఈ భారీ వసూళ్లతో 'జైలర్ 2' తమిళ చిత్ర పరిశ్రమలో మునుపటి రికార్డులన్నింటినీ బద్దలు కొట్టింది. రజనీకాంత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన '2.0' చిత్రం లైఫ్‌టైమ్ కలెక్షన్లను కూడా ఇది అధిగమించింది. అంతేకాకుండా 'పీకే', 'ఛావా' వంటి చిత్రాల మొత్తం వసూళ్లను కూడా దాటి 2026లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ వారం చివర్లో 'రామాయణ' వంటి భారీ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో 'జైలర్ 2' వసూళ్ల వేగం కొంత తగ్గే అవకాశం ఉంది.



48 ప్రభుత్వ స్కూళ్లను దత్తత తీసుకున్న మంచు లక్ష్మి

గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యమని వెల్లడి
సంగారెడ్డి జిల్లా చౌటకూర్ స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభం

ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త మంచు లక్ష్మి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నడుం బిగించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్టు ఆమె తెలిపారు. తన 'టీచ్ ఫర్ చేంజ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈరోజు సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంచు లక్ష్మి... చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'టీచ్ ఫర్ చేంజ్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన లక్ష్మి... గ్రామీణ విద్యార్థుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. దత్తత తీసుకున్న పాఠశాలల్లో స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. నాణ్యమైన విద్య ద్వారానే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

ప్రేమలో దారుణంగా మోసపోయా

రెజీనా కసాండ్రా



- ప్రేమలో మోసపోయి డిప్రెషన్‌కు గురయ్యానన్న రెజీనా
- 2020లో తన జీవితంలో ఈ చేదు అనుభవం ఎదురైందని వెల్లడి
- ఇతరుల ప్రేమ కన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యమన్న నటి

విభిన్నమైన పాత్రలతో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రెజీనా కసాండ్రా... తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించారు. గతంలో తాను ప్రేమలో దారుణంగా మోసపోయానని, ఆ కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని ఆమె తెలిపారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్ 2' (తెలుగులో 'మహాశక్తి') చిత్ర ప్రచార కార్యక్రమాల్లో ఈ వ్యాఖ్యలు చేశారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ... "2020లో నా జీవితంలో ఊహించని ఘటన జరిగింది. నేను ప్రేమించిన వ్యక్తి నన్ను మోసం చేయడంతో ఆ బంధం ముగిసిపోయింది. ఆ పరిణామం నన్ను మానసికంగా కుంగదీసింది. చాలా కాలం డిప్రెషన్‌తో బాధపడ్డాను. ఆ బాధ నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది" అని రెజీనా భావోద్వేగానికి గురయ్యారు. ఈ కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో సహాయపడిందని ఆమె అన్నారు. "ఇతరుల నుంచి ప్రేమను ఆశించే ముందు, మనల్ని మనం ప్రేమించుకోవడం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు. యువతులు లైంగిక వేధింపులు వంటి చేదు అనుభవాలు ఎదుర్కొన్నప్పుడు తమను తాము నిందించుకోవద్దని సూచించారు. బాధను మనసులో దాచుకోకుండా, నమ్మకమైన వారితో పంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె సలహా ఇచ్చారు.



'ఓ మైసా రే'.. రష్మిక 'మైసా' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల

నేషనల్ క్రష్' రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'మైసా' నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ విడుదల చేశారు. ఈ సినిమా నుంచి 'ఓ మైసా రే' పేరుతో తొలి పాట లిరికల్ వీడియోను సోమవారం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మహిళా శక్తిని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా ఈ పాట సాగుతూ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ గీతానికి, సుప్రసిద్ధ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ శక్తివంతమైన సాహిత్యాన్ని అందించారు. గాయని సింధుజ శ్రీనివాసన్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. కథానాయిక పాత్రలోని ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తిని ఈ పాట ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా, ఈ లిరికల్ వీడియోలో రష్మిక మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా ఆమె లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ పాటకు అదనపు ఆకర్షణగా నిలిచింది. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రొటీన్ పాత్రలకు భిన్నంగా రష్మిక చేస్తున్న ఈ ప్రయోగంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. 'మైసా' చిత్రాన్ని నవంబర్ 27న తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com